ప్రజాశక్తి

ఆదివారం 5 మే 2024 | 8 పేజీలు

అనంతపురం | శ్రీ సత్యసాయి

పోస్టల్ బ్యాలెట్ గందరగోళం

◆కదిరిలో 7గంటలైనా మొదలవని ఓటింగ్

◆పక్క జిల్లా వారికి ఓటేసేందుకు నోఛాన్స్

ప్రజాశక్తి-కదిరి టౌన్

ఉద్యోగుల పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ గందరగోళంగా మారింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శుక్రవారం నుంచి పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వినియోగించే కార్యక్రమం ప్రారంభం అయ్యింది. ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులు ఆయా ప్రాంతాల్లో ఓటు వేసే అవకాశం కల్పించారు. అయితే బ్యాలెట్ పేపర్లు రాకపోవడం, ఉద్యోగులు ఎక్కడ ఓటు వేయాలన్న దానిపై సరైన స్పష్టత లేకపోవడంతో ఆయా కేంద్రాల వద్ద గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. శుక్రవారం రోజున రాప్తాడు పోలింగ్ కేంద్రం వద్ద ఈ పరిస్థితి కన్పించింది. శనివారం నాడు శ్రీసత్యసాయి జిల్లా కదిరిలో ఇలాంటి గందరగోళ పరిస్థితే నెలకొంది. శనివారం నాడు కదిరి పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో పోస్టల్ బ్యాలెట్ ఓటు కోసం దరఖాస్తు చేసుకున్న ఉద్యోగులు ఓటు వేసేందుకు వచ్చారు. ఎవరు ఎక్కడ ఓటు వేయాలన్న దానిపై స్పష్టత లేకపోవడంతో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. రిటర్నింగ్ అధికారులు ఎక్కడైతే విధులకు హాజరవుతారో అక్కడ శిక్షణ సమయంలోనే పోస్టల్ బ్యాలెట్ మిగతా 3లో

కదిరిలో పోస్టల్ బ్యాలెట్ ఓటు వేసేందుకు కేంద్రం వద్ద వేచి ఉన్న ఉద్యోగులు

బహిరంగ సభకు హాజరైన వైసిపి శ్రేణులు

◆'పురం', జిల్లా గురించి ప్రస్తావించని ముఖ్యమంత్రి

◆గత హామీలపైనా మాటల్లేవ్..

◆బాబుపై విమర్శలతోనే సాగిన జగన్ ప్రసంగం

హామీల ఊసేలేదు..!

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం నియోజక వర్గ అభివృద్ధి కోసం నూతనంగా ఇచ్చిన హామీలు లేవు.. గతంలో ఇచ్చిన హామీలపై కనీసం ప్రసత్తవాన లేకుండానే ముఖ్యమంత్రి, వైసిపి అధినేత వైఎస్.జగన్మోహన్‌రెడ్డి సభ ముగిసింది. ఎన్నికల ప్రచార సభలో భాగంగా శనివారం ఉదయం వైసిపి ఆధ్వర్యంలో బహిరంగ సభను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జగన్మోహన్‌రెడ్డి హాజరై ప్రసంగించారు. తన ప్రసంగంలో 2019లో హిందూపురం అభివృద్ధికి ఇచ్చిన హామీలు, కొత్త వాటిపై కనీస ప్రస్తావన కూడా చేయలేదు. అధికారంలోకి వస్తే పురం కోసం చేసే అభివృద్ధి పనులపైనా మాటమాత్రమైనా హామీలు ఇవ్వలేదు. తన ప్రసంగం మొత్తం చంద్రబాబు నాయుడుపై విమర్శలు చేయడానికే అధిక ప్రాధాన్యత ఇచ్చారు. 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా చేసిన చంద్రబాబు పేదల సంక్షేమం కోసం ఒక్క పథకం కూడా తీసుకురాలేదన్నారు. బాబు అధికారంలో ఉన్న సమయంలో పేదల ఖాతాల్లోకి ఒక్క రూపాయి వేసిన దాఖలాల్లేవన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చిన 5 సంవత్సరాల్లో ఏకంగా 130 సార్లు బటన్ నొక్కి రూ.2.70 లక్షల కోట్లు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి వేశామన్నారు. ఇదే డబ్బు చంద్రబాబు హయాంలో ఎవరి జేబులోకి వెళ్లిందో జనం తెలుసుకోవాలన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ గురించి చంద్రబాబు వాస్తవాలు తెలుసుకోకుండా ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు. భూమిపై రైతులకు సంపూర్ణ హక్కులు కల్పించేందుకు ఈ చట్టాన్ని తెచ్చామన్నారు. ఎటువంటి వివాదం లేని టైటిల్ ప్రతి ఒక్కరికీ ఇవ్వాలన్నదే తన లక్ష్యం అన్నారు. జగన్ భూములు ఇచ్చేవాడే కానీ.. లాక్కునే వాడు కాదన్నారు. రూ. 2.70 లక్షల కోట్ల విలువైన సంక్షేమ పథకాలు అమలు చేయడంతో పాటు 231 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను ఇచ్చిన ఘనత వైసిపి ప్రభుత్వానికే దక్కిందన్నారు. ఇలాంటి పరిపాలనను ప్రజలు మరోసారి ఆశీర్వదించాలన్నారు. హిందూపురం ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు దీపిక, శాంతమ్మలకు ఓట్లు గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మంత్రి, రాయల సీమ కో ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి, జిల్లా అధ్యక్షులు నవీన్ నిశ్చల్, హిందూపురం ఎంపీ అభ్యర్థి శాంతమ్మ, ఎమ్మెల్యే అభ్యర్థి దీపిక, పెనుకొండ ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీ చరణ్, మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇంద్రజ, వైస్ ఛైర్మన్లు జబివుల్లా, బలరామిరెడ్డితో పాటు వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బహిరంగ సభలో ప్రసంగిస్తున్న జగన్మోహన్‌రెడ్డి

విభజన హామీలపై స్పందించేరా..?

◆ నేడు ధర్మవరానికి అమిత్‌షా, చంద్రబాబు రాక ◆ ఎన్నికల బహిరంగ సభ

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

రాష్ట్ర విభజన సమయంలో కేంద్రప్రభుత్వం ఇచ్చిన హామీలపై కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా ఏ రకంగా స్పందిస్తారన్నది ఆసక్తికరంగా మారింది. విభజన సమయంలో వెనుకబడిన అనంతపురం జిల్లాకు బిజెపి గతంలో హామీలను ఇచ్చింది. 2014 నుంచి అధికారంలో ఉన్న బిజెపి ఈ హామీల అమలును ఏ మాత్రం పట్టించుకోలేదన్న విమర్శలున్నాయి. ఇప్పుడు ధర్మవరంలో బిజెపి అభ్యర్థి సత్యకుమార్‌ను గెలిపించాలని ప్రచారం చేసే నిమిత్తం అమిత్‌షా ఆదివారం నాడు ధర్మవరం పట్టణానికి రానున్నారు. ఆయనతోపాటు టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు కూడా ఇక్కడికే విచ్చేస్తున్నారు. ఈ సందర్భంగానైనా విభజన హామీలపై అమిత్ షా ఏరకంగా స్పందించనున్నారన్నది చర్చనీయాంశంగా మారింది.

2014లో రాష్ట్ర విభజన సమయంలో వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీని ఇస్తామని కేంద్రం హామీనిచ్చింది. ఆ రకంగా ఉమ్మడి అనంతపురం జిల్లాకు మొదటి మూడు సంవత్సరాలు ఏడాదికి రూ.50 కోట్ల చొప్పున నిధులిచ్చి తరువాత చేతులెత్తేసింది. వాస్తవానికి బుందేల్‌కండ్ తరహా ప్యాకేజీని కేంద్రం ఇస్తానని హామీనిచ్చింది. దీని ప్రకారమైతే రాయలసీమ జిల్లాకు రూ.20 వేల కోట్లకుపైగా ప్యాకేజీని ఇవ్వాల్సి ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. కేంద్రం దీనిపై ఏ మాత్రం పెదవి విప్పలేదు. ఇకపోతే కేంద్రీయ విశ్వవిద్యాలయం అనంతపురంలో ఏర్పాటు చేసినప్పటికీ పూర్తిస్థాయి నిధుల కేటాయింపులు జరగలేదు. 2018లో విశ్వవిద్యాలయం ప్రారంభం అయితే ఈ ఏడాది మిగతా 3లో

నేడు సిపిఎం ప్రాంతీయ సభ

◆హాజరు కానున్న సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్ ముఖ్య నేతలు

◆ఇండియా వేదిక అభ్యర్థుల గెలుపునకు ప్రచారం

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

సాధారణ ఎన్నికలు -2024 సందర్భంగా సిపిఎం ఆధ్వర్యంలో నేడు ప్రాంతీయ సభ నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ తెలిపారు. సార్వత్రిక ఎన్నికల్లో ఇండియా వేదిక అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా సిపిఎం పని చేస్తోందన్నారు. ప్రజల అజెండానే - ఎన్నికల అజెండా కావాలని కోరుతూ సిపిఎం విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా ఆదివారం ఉదయం 10 గంటలకు అనంతపురం నగరంలోని గుత్తిరోడ్ ద్వారకా చలమారెడ్డి ఫంక్షన్ హాల్‌లో సిపిఎం ప్రాతీయ సభ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సభకు కేరళ రాష్ట్రం మాజీ మంత్రి, సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు ఎం.ఎ.బేబి, సిపిఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎంపీ సయ్యద్ అజీజ్ బాషా, మాజీ మంత్రి ఎఐసిసి కార్యవర్గ సభ్యులు ఎన్.రఘువీరారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరవుతున్నట్లు తెలిపారు. ఉదయం 10 గంటలకు నిర్వహించే సమావేశానికి మిగతా 3లో

పొలిట్ బ్యూరో సభ్యులు ఎం.ఎ.బేబికి స్వాగతం పలుకుతున్న జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

అనంతలో 'తమ్ముళ్ల' కొట్లాట..!

3 లో..

అంతర్ రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టు తనిఖీ

రాయదుర్గం : పట్టణ పొలిమేరలోని పైతోట గాలి మారమ్మ దేవస్థానం వద్ద జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన అంతరాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టును కళ్యాణదుర్గం డీఎస్పీ బి.శ్రీనివాసులు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా వాహనాల తనిఖీ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్ణాటక రాష్ట్రం నుంచి రాష్ట్రంలో ప్రవేశించే వాహనాలు, వ్యక్తులను క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. చట్ట విరుద్ధంగా నగదు, మద్యం, ఎన్నికల కానుకలు రాష్ట్రంలో ప్రవేశించకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో రాయదుర్గం పోలీస్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ బందోబస్తు పర్యవేక్షణ

పట్టణంలోని పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన బందోబస్తును కళ్యాణదుర్గం డీఎస్పీ బి.శ్రీనివాసులు శనివారం పర్యవేక్షించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిసైడింగ్ ఆఫీసర్లు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్లు, పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటుహక్కు వినియోగించుకునేందుకు ఫెసిలిటేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. సెంటర్ వద్ద ఎన్నికల నియమ నిబంధనల ప్రకారం నడుచుకోవాలని సిబ్బందికి సూచించారు. డీఎస్పీ వెంట పోలీస్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, సిబ్బంది ఉన్నారు.

పోలీసుల కవాతు

వజ్రకరూరు : ప్రశాంత ఎన్నికలకు సహకరించకపోతే చర్యలు తప్పవని ఉరవకొండ ఎస్ఐ రాఘవేంద్రప్ప హెచ్చరించారు. ఎస్పీ ఆదేశాలు మేరకు శనివారం ఉరవకొండ మండల పరిధిలోని చిన్న ముష్టూరు కవాతుతోపాటు గ్రామసభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 13న జరిగే సారవత్రిక ఎన్నికల్లో ప్రజలు ప్రశాంత వాతావరణంలో ఓటుహక్కు వినియోగించుకోవాలన్నారు. ఎవరైనా అల్లర్లు సృష్టించినా, ఓటర్లను భయపెట్టేలా ప్రవర్తించినా చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శింగనమల : ఎన్నికల నేపథ్యంలో మండల వ్యాప్తంగా ఎవరైనా అల్లర్లు, గొడవలకు పాల్పడితే చర్యలు తప్పవని ఎస్ఐ చంద్రశేఖర్ హెచ్చరించారు. శనివారం మండల కేంద్రంతోపాటు బండమీదపల్లి గ్రామాల్లో పోలీసులు కావాతు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ప్రతి ఒక్కరూ అందుకు అనుగుణంగా నడుచు కోవాలన్నారు. అలా కాకుండా ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలతో పాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రశాంతంగా ఓటును వినియోగించుకోవాల న్నారు. ఈ కార్యక్రమంలో బెటాలియన్ ఫోర్స్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దపప్పూరు : ఎస్పీ ఆదేశాలతో మండలంలోని సమస్యాత్మక గ్రామాల్లో కేంద్ర సాయుధ బలగాలు కవాతు నిర్వహించారు. మండలంలోని సింగనగుట్టపల్లి, తబ్జూల గ్రామాల్లో కవాతు నిర్వహించి ఎన్నికలపై స్థానికులకు అవగాహన కల్పించినట్లు ఎస్ఐ శరత్‌చంద్ర తెలిపారు. ప్రశాంత ఎన్నికలకు కవాతు నిర్వహించినట్లు ఎస్ఐ తెలిపారు. ప్రజలు స్వేచ్ఛగా ఓటుహక్కు వినియోగించుకోవాలని సూచించారు.

అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ శరత్‌చంద్ర

గ్రామాలు బాగుండాలంటే 'కూటమి'ని ఆదరించాలి

సర్పంచుల సంఘం గౌరవాధ్యక్షులు రాజేంద్రప్రసాద్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రాష్ట్రంలో గ్రామాలు బాగుండాలంటే ఎన్‌డిఎ కూటమి అభ్యర్థులను గెలిపించాలని సర్పంచుల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు, ఎపి పంచాయతీరాజ్ ఛాంబర్ వ్యవస్థాపక అధ్యక్షులు బాబు రాజేంద్రప్రసాద్ పిలుపునిచ్చారు. శనివారం నగరంలోని అర్బన్ టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన జగన్ అధికారంలోకి వచ్చాక గ్రామీణాభివృద్ధి కుంటుపడిందన్నారు. గ్రామాల అభివృద్ధికి నిధులు ఇవ్వకపోగా, ఆర్థిక సంఘం కింద కేంద్రం ఇచ్చిన నిధులను కూడా పక్కదారి పట్టించారన్నారు. సుమారు రూ.60వేల కోట్లు గ్రామాలకు రాకుండా చేసిన ద్రోహి జగన్ అని ధ్వజమెత్తారు. ఇలాంటి వ్యక్తి మరోసారి సిఎం అయితే గ్రామాల పరిస్థితి ఎంత అధ్వాన్న పరిస్థితికి చేరుకుంటాయో ఆలోచించాలన్నారు. ఇకపోతే ఎన్‌డిఎ కూటమి ప్రకటించిన మేనిఫెస్టోలోనే గ్రామాలకు ఏం చేస్తాం.. స్థానిక సంస్థ ప్రజా ప్రతినిధులకు ఏం చేస్తామన్నది స్పష్టంగా చెప్పారన్నారు. గ్రామ పంచాయతీలకు నిధులు ఇవ్వడమే కాకుండా.. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు పూర్తిగా వాటిపై హక్కు కల్పిస్తామన్నారని వివరించారు. కావున గ్రామాలు అభివృద్ధి చెందాలంటే ఎన్‌డిఎ కూటమి అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సర్పంచుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గొనుగుంట్ల భూషణ, ఛాంబర్ కార్యనిర్వాహక కార్యదర్శి డేగల కృష్ణమూర్తి, ఛాంబర్ జిల్లా అధ్యక్షులు వేలూరు రంగయ్య, మాజీ ఎంపిపి ఇస్మాయిల్, సభ్యులు వీరేష్, తదితరులు పాల్గొన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న రాజేంద్రప్రసాద్

జగన్‌ను మరోసారి సిఎంను చేసుకుందాం

వైఎస్ఆర్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి రమణ

ప్రజాశక్తి-వజ్రకరూరు

ఉద్యోగ, కార్మికుల పక్షపాతి అయిన జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రి చేసుకుని ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకుందామని వైఎస్ఆర్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి రమణ పిలుపునిచ్చారు. శనివారం ఉరవకొండలోని వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రపంచ బ్యాంకు జీతగాడిగా పని చేసి రాష్ట్రంలోకి ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు విధానాలను తీసుకొచ్చి ఉద్యోగులకు భద్రత లేకుండా చేసిన టిడిపి అధినేత చంద్రబాబును నమ్మే పరిస్థితిలో ఎవరూ లేరన్నారు. 2014లో 'బాబు వస్తే జాబు వస్తుంది, నిరుద్యోగ భృతి ఇస్తాం' అంటూ హామీలు ఇచ్చి ఉద్యోగులతోపాటు నిరుద్యోగులను కూడా మోసం చరిత్ర బాబుది అన్నారు. వీటితోపాటు అనేక హామీలను ఇచ్చి విస్మరించారన్నారు. అయితే జగన్ అధికారంలోకి వచ్చాక నాలుగు నెలల్లోనే 1,25,000 సచివాలయ రెగ్యులర్ ఉద్యోగాలు ఇచ్చి దేశ చరిత్రలోనే చరిత్ర సృష్టించారన్నారు. ఐదేళ్లలో 22,1300 రెగ్యులర్, 43,923 కాంట్రాక్టు, 3,73,161 ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలు ఇచ్చారన్నారు. చంద్రబాబు హయాంలో నిరుద్యోగ రేటు 5.3శాతం ఉంటే జగన్ పాలనలో 4.1 శాతానికి తగ్గించారన్నారు. కరోనాలో కూడా పథకాలు తగ్గించని మహనీయుడు జగన్ అన్నారు. కావున ఉద్యోగ, కార్మికుల పక్షపాతి జగన్‌ను మరోసారి సిఎంను చేసుకునేందుకు వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా వై.విశ్వేశ్వర్‌రెడ్డి, ఎంపీగా శంకరనారాయణను గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు ఎసీ ఎర్రిస్వామి, చెంగల మహేష్, తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు విడుదల చేస్తున్న వైఎస్ఆర్ ట్రేడ్ యూనియన్ నాయకులు

గుత్తిలో టిడిపి ముమ్మర ప్రచారం

గుత్తి : మున్సిపాలిటీ పరిధిలోని పలువార్డుల్లో టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గుమ్మనూరు జయరామ్ సోదరుడు నారాయణ, ఆయన సతీమణి కమలమ్మ శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా గుమ్మనూరు జయరామ్, ఎంపీగా అంబికా లక్ష్మీనారాయణ అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి పరామర్శ

గుత్తి : గుత్తి ఆర్ఎస్‌లోని 7వ వార్డుకు చెందిన టిడిపి నాయకుడు నాగరాజు సతీమణి నారాయణమ్మ మృతిచెందడంతో టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గుమ్మనూరు జయరామ్ సోదరుడు నారాయణ కుటుంబాన్ని పరామర్శించారు. ఇందులో భాగంగా నారాయణమ్మ మృతదేహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

వర్షం కోసం ప్రత్యేక ప్రార్థనలు

రాయదుర్గం : వర్షం కురువాలని పట్టణంలోని బళ్లారి రోడ్డు ఈద్గా మైదానంలో ముస్లిములు శనివారం సామూహిక ప్రత్యేక నమాజ్ చేశారు. ప్రభుత్వ ఖాజీ మొహమ్మద్ సైఫుల్లా, ఉలామాల ఆధ్వర్యంలో దాదాపు వెయ్యికి మందిపైగా ముస్లిములు హాజరై ప్రార్థనలు చేశారు. ఇందులో భాగంగా హఫీజ్ రహమతుల్లా అష్రఫీ కుద్బా పఠించగా, ముఫ్తీ నూర్ ముహమ్మద్ వర్షం కోసం దువా పఠించారు.

బీఎస్పీ అభ్యర్థి ఎన్నికల ప్రచారం

రాయదుర్గం : గుమ్మఘట్ట మండల కేంద్రంలో బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) రాయదుర్గం అసెంబ్లీ అభ్యర్థి చిందనూరు నాగరాజు శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి బీఎస్పీకి ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఎసీ నాయకులు ఉలిగప్ప, నాగరాజు, మల్లి, ప్రకాష్, మల్లికార్జున, పెన్నప్ప, ప్రసాదు, యల్లప్ప, మల్లక్క, గంగమ్మ, గాయత్రి, యశోదమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఓటుహక్కుపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఓటుహక్కుపై అవగాహన

అనంతపురం : ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక ఆధ్వర్యంలో శనివారం నగరంలోని ఎన్‌టిఆర్ సర్కిల్‌లో ఓటుహక్కు వినియోగంపై అవగాహన కల్పిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వేదిక జిల్లా అధ్యక్షులు కె.అల్తాఫ్ మాట్లాడుతూ ఓటును నోటుకు అమ్ముకోకుండా నిజాయితీగా తమకు నచ్చిన అభ్యర్థికి ఓటు వేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐక్యవేదిక జిల్లా కోశాధికారి టివి.రెడ్డి, పివి.ప్రసాద్‌రెడ్డి, బాలకృష్ణ, బాబు ప్రసాదు, అగస్టీన్, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి నాయకుల ప్రచారం

వజ్రకరూరు : ఉరవకొండ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పయ్యావుల కేశవ్‌కు మద్దతుగా టిడిపి నాయకులు శనివారం ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా ఉరవకొండలోని ఇందిరానగర్‌లో శనివారం ఇంటింటికీ వెళ్లి టిడిపి అధికారంలోకి వస్తే అమలు చేయనున్న సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

బడుగుల సంక్షేమమే ప్రధాన అజెండా

గుమ్మగట్ట : బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే టిడిపి ప్రధాన అజెండా అని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కాలవ శ్రీనివాసులు అన్నారు. శనివారం మండల పరిధిలోని గొల్లపల్లి, గలగల, ఆర్.కొత్తపల్లి, కె.పీ.దొడ్డి, రంగసముద్రం, తాళ్లకెర, కోనాపురం బి.టి.ప్రాజెక్టు, గుమ్మగట్ట, గోనబావి, గ్రామాలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి అధికారంలోకి వస్తే సూపర్ సిక్స్ పథకాలతో అన్నివర్గాలూ అభివృద్ధి చెందుతాయన్నారు. టిడిపి గెలిస్తే తల్లికి వందనం కింద ఎంతమంది ఉన్నా ఒక్కొక్కరికి రూ.15వేలు, ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతలకు ఏడాదికి రూ.20వేలు, 18 ఏళ్లు దాటిన మహిళలకు నెలకు రూ.1500, సామాజిక పింఛన్ రూ.4వేలతోపాటు అనేక పథకాలను అమలు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ గిరిమల్లేప్ప, నాయకులు దానవేంద్ర, కేపీ దొడ్డి రాజు, పై తోట సిద్దన్న, తిప్పేస్వామి, వీరాపురం సర్పంచి నాగరాజు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

మృతిచెందిన జనార్ధన్

గుత్తి : పట్టణంలోని ఎంఎస్ జూనియర్ కళాశాల సమీపంలో రైలు కిందపడి శనివారం వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు, జీఆర్పీ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని శ్రీపురం గ్రామానికి చెందిన కోనా జనార్ధన్ (46) ఆటో డ్రైవర్‌గా ఉంటూ జీవనం కొనసాగించేవాడు. ఈక్రమంలో కుటుంబ సమస్యలతోపాటు మానసిక పరిస్థితి సరిగ్గా ఉండేది కాదు. దీంతో అతడు రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. జీఆర్పీ పోలీసుల కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

మద్యం పట్టివేత

వజ్రకరూరు : సెబ్ అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ రామకృష్ణ ఆదేశాల మేరకు శనివారం తెల్లవారుజామున విడపనకల్ మండల పరిధిలోని వి.కొత్తకోట గ్రామ శివారుల్లో 1344 కర్ణాటక మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ ఇన్‌స్పెక్టర్ పి.కిషోర్‌కుమార్ తెలిపారు. మద్యంతోపాటు దూది నాగరాజు, గుణక బాలాంజనేయులు, నింబగల్లు ధనుంజయను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో సెబ్ ఇన్‌స్పెక్టర్ ఎం.ప్రవీణ్‌కుమార్ నాయక్, సిబ్బంది ఎం. హేమంత్‌కుమార్, సి.వాసు, ఎం.శివయ్య పాల్గొన్నారు.

సమ్మర్ క్యాంప్

చెస్ ఆడుతున్న విద్యార్థులు

అనంతపురం : నగరంలోని సాయినగర్‌లో ఉన్న శ్రీ వర్షా ఆసుపత్రి బిల్డింగ్‌లో ఏ వన్ ఏడిఎస్ వేదికగా ఈనెల 6వ తేదీ నుంచి సమ్మర్ క్యాంప్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు అమ్మినేని ఉదయ్‌కుమార్, వంశీకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పిల్లల్లోని సృజనాత్మకతను వెలికి తీసేందుకు అబాకస్ చెస్ డాన్స్, వేదిక్ మాథ్స్ ఒకే వేదికగా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఏసీ క్యాంపస్‌లో మెరుగైన శిక్షణ అందించేందుకు నిష్ణాతులను శిక్షణ నిమిత్తం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని జిల్లా ప్రజల సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైసిపి ఎన్నికల కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కుళ్లాయప్ప

నార్పల : వైసిపి ఎన్నికల కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నార్పలకు చెందిన వైసిపి సీనియర్ నాయకులు మిద్దె కుళ్లాయప్ప నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన సిఎం జగన్, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఎమ్మెల్యే వైవిఆర్ ప్రార్థనలు

గుత్తి : పట్టణంలోని అద్భుత కుమార్ స్వస్థతశాలలో ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి శనివారం ప్రత్యేక ప్రార్థన నిర్వహించారు. ఇందులో భాగంగా సిఎం జగన్ మరోసారి ముఖ్యమంత్రి కావాలని, వై.వెంకటరామిరెడ్డి మరోసారి ఎమ్మెల్యే అవ్వాలని ఫాస్టర్ రెవరెండ్ అద్భుతకుమార్ నేతృత్వంలో ప్రార్థనలు చేశారు. కులమతాలకు అతీతంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందించిన ఏకైక సిఎం జగన్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు కోనా మురళీధర్‌రెడ్డి, డి.హుస్సేన్ పీరా, క్రషర్ మధుసూదన్‌రెడ్డి, గురుప్రసాద్‌యాదవ్, బి.రాజ్‌కుమార్‌రెడ్డి, వి.వరద, కె.హేమలత, తదితరులు పాల్గొన్నారు.

ప్రార్థనలు చేస్తున్న వై.వెంకటరామిరెడ్డి

అనంతలో తమ్ముళ్ల కొట్లాట..!

ఘర్షణ పడుతున్న దగ్గుపాటి, ప్రభాకర్ చౌదరి మద్దతుదారులు

రణ రంగంగా టిడిపి అర్బన్ కార్యాలయం
చౌదరి, దగ్గుపాటి మద్దతుదారుల వాగ్వాదం
పోలీసుల ప్రవేశంతో సద్దుమణిగిన వివాదం

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

అనంతపురం అర్బన్ నియోజకవర్గం టిడిపిలో మరోసారి విభేదాలు పొడచూపాయి. అనంతపురం అర్బన్ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, మాజీ ఎమ్మెల్యే టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి వైకుంఠం ప్రభాకర్ చౌదరిలు టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు జిల్లా పర్యటన నేపథ్యంలో విజయవంతం కోసం సమావేశం నిర్వహించారు. ప్రభాకర్ చౌదరి కార్యాలయంలో సమావేశం జరుగుతుండగా ఎన్నికల ప్రచారాలకు సంబంధించి ఒకరి డివిజన్‌లో మరొకరు ఎందుకు వస్తున్నారంటూ చర్చ మొదలైంది. ఇది కాస్త మాటామాట పెరిగి మాజీ డిప్యూటీ మేయర్ సాకే గంపన్న అనుచరులు తెలుగు యువత నాయుడు లింగారెడ్డిపై చేయి చేసుకున్నారు. దీంతో వివాదం తీవ్రం అయ్యింది. దాదాపు రెండు గంటల సేపు ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఈ ఘర్షణ జరుగుతుండగానే దగ్గుపాటి ప్రసాద్, ప్రభాకర్ చౌదరి ఇద్దరూ అక్కడి నుంచి ప్రసాద్ కార్యాలయానికి వచ్చారు. ఈ సమయంలో చౌదరి వర్గీయులు ప్రసాద్ కార్యాలయంలోకి వస్తుండగా టిడిపి నాయకుడు సుధాకర్ నాయుడు, చంద్రదండు ప్రకాష్ నాయుడులు అడ్డుకున్నారు. దీంతో చౌదరి వర్గీయులు ఒక్కసారిగా తోసుకుంటూ లోపలికి వచ్చారు. అక్కడే ఉన్న మాజీ కార్పొరేటర్లు, నాయకులు గొడవను అడ్డుకునే ప్రయత్నం చేసినా ఫలితం దక్కలేదు. ఒకరిపై ఒకరు పరుష పదజాలంతో దూషించుకున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని రెండు వర్గాల నేతలను అక్కడి నుంచి పంపించేశారు. ఎన్నికల సమీపిస్తున్న తరుణంలో టిడిపిలో నెలకొన్న విభేదాలు ఆ పార్టీ నేతలను ఆందోళనకు గురి చేస్తున్నాయి.

చంద్రబాబు పర్యటనను జయప్రదం చేద్దాం
టిడిపి నేతలు ప్రభాకర్ చౌదరి, దగ్గుపాటి ప్రసాద్

సాధారణ ఎన్నికల ప్రచారంలో భాగంగా తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అనంతపురంలో నిర్వహించే పర్యటనను జయప్రదం చేద్దామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి వైకుంఠం ప్రభాకర్ చౌదరి, అనంతపురం అర్బన్ నియోజకవర్గం కూటమి టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, టిడిపి ఎన్నికల ఇన్‌ఛార్జి నాని, పార్లమెంట్ అధ్యక్షులు వెంకట శివుడు యాదవ్ పిలుపునిచ్చారు. శనివారం మాజీ ఎమ్మెల్యే చౌదరి కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలో టిడిపి అభ్యర్థుల గెలుపు కోసం చంద్రబాబు బహిరంగ సభ నిర్వహిస్తున్నారని చెప్పారు. ఈ సభలో టిడిపి, జనసేన, బిజెపి నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

పరిటాల శ్రీరామ్ సమక్షంలో టిడిపిలో చేరుతున్న వైసిపి నాయకులు

పరిటాల సునీతకు మద్దతుగా విస్తృత ప్రచారం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రాప్తాడు నియోజకవర్గంలో మాజీ మంత్రి పరిటాల సునీత గెలుపే లక్ష్యంగా తెలుగు మహిళలు ప్రచారం చేస్తున్నారు. పరిటాల సునీత సోదరి గుంటూరు లక్ష్మి, పరిటాల శైలజ, బైటేని చైతన్య, పరిటాల రాజేశ్వరి తదితరులు ప్రచారంలో దూసుకెళ్తున్నారు. అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లి పంచాయతీ పరిధిలోని ప్రభాకర్ చౌదరి కాలనీ, సిపిఎం కాలనీల్లో ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి తెలుగుదేశం పార్టీ మ్యానిఫెస్టో గురించి వివరిస్తూ ఓట్లు అభ్యర్థించారు. పరిటాల సునీతను గెలిపించుకుని రాప్తాడు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకోవాలన్నారు.

నీటి టబ్‌లో పడి బాలుడి మృతి

చెన్నేకొత్తపల్లి :మండలంలోని ఎర్రజిన్నాన్న గారిపల్లి (కొండికొండపల్లి) గ్రామానికి చెందిన బొగ్గు మురళి, బొగ్గు అరుణ దంపతుల ఏడాది బాలుడు శనివారం నీటి టబ్‌లో పడి మృతి చెందాడు. ఆడుకుంటున్న బాలుడు కనపడక పోయేసరికి తల్లిదండ్రులు వెతికారు. అయితే ఇంటి వద్ద ఉన్న నీటి టబ్ లో పడి ఊపిరి ఆడక మృతి చెందాడు. బాలుడి మృతితో తల్లిదండ్రులు బోరున విలపించారు.

ఎన్నికల సమయంలోనూ ఆగని అక్రమ అరెస్టులు

హిందూపురం : జిల్లాలో ఎక్కడ ముఖ్యమంత్రి పర్యటించినా వామపక్ష నాయకులతో పాటు వామపక్ష విద్యార్థి సంఘాలను పోలీసులు అక్రమ అరెస్టులు చేస్తారు. ఈ అక్రమ అరెస్టులు ఎన్నికల సమయంలో సైతం ఆగడం లేదు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సిఎం జగన్ శనివారం హిందూపురం వచ్చారు. ముఖ్యమంత్రిని ఎక్కడ అడ్డుకుంటారో అనే కారణంతో ఎస్‌ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు బాబావలి, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, సిపిఐ నాయకులు వినోద్ కుమార్‌లను పోలీసులు ముందస్తు అరెస్టు చేయడంతో పాటు వారు సభా స్థలి వద్దకు వెళ్లకూడదని హెచ్చరిస్తూ నోటీసులు ఇచ్చి పంపారు. వారు మాట్లాడుతూ హిందూపురం నియోజకవర్గంలో విద్యార్థుల సమస్యలపై రాజీ లేని పోరాటం చేస్తున్న నాయకులను అరెస్టు చేయడాన్ని ఖండించారు. హిందూపురంలో మోడల్ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ ఉర్దూ జూనియర్ కళాశాల ఏర్పాటు చేస్తామని ఐదేళ్ల క్రితం సిఎం జగన్ హామీ ఇచ్చి నెరవేర్చకుండా కాలయాపన చేశారన్నారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థలను నిర్లక్ష్యం చేశారన్నారు. వీటిపై ప్రశ్నిస్తారనే కారణంతో ఉద్యమాలను అణచి వేయాలని అక్రమ అరెస్టు చేయడం సరికాదన్నారు.

టిడిపితోనే గ్రామాల అభివృద్ధి

ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎస్ రాజు

మడకశిర : టిడిపితోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎస్.రాజు తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం ఆయన రొళ్ల మండలంలో పర్యటించారు. ముందుగా ప్రతి గ్రామంలో ఎంఎస్ రాజు జన్మదిన వేడుకలు నిర్వహించారు. రొళ్ల మండలంలోని హులికుంట గ్రామంలో ఎంఎస్ రాజు నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామితో కలిసి రోడ్ షో నిర్వహించారు. రాజు మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు మంచి చేకూర్చేలా టిడిపి అధినేత చంద్రబాబు 25 సంక్షేమ పథకాలు ప్రకటించారన్నారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపిగా బికె.పార్థసారధిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ప్రచారంలో సీనియర్ నాయకులు వి.ఎం.నారాయణరెడ్డి, వి.ఎం. పాండురంగప్ప, మండల కన్వీనర్ దాసిరెడ్డి, బిఐఎస్ గురుమూర్తి, చిన్న తిమప్ప, జిఎస్ యోగానంద్, రామకృష్ణ, జికె.ఈరన్న, రాజకుమార్, సిద్ద గంగప్ప, దాసప్పపాలెం నాగరాజు, కృష్ణప్ప పులికుంట నాగరాజు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

సిఎం సమక్షంలో వైసిపిలో చేరిక

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బాలాజీ మనోహర్, ఆదిమూర్తి, అమానుల్లాలు శనివారం ఉదయం ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి సమక్షంలో వైసిపి తీర్థం పుచ్చుకున్నారు. వీరికి జగన్‌మోహన్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలో ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మంత్రి, వైసిపి రాయల సీమ కో ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి, జిల్లా అధ్యక్షులు నవీన్ నిశ్చల్ పాల్గొన్నారు.

గార్మెంట్స్ పరిశ్రమలు తీసుకొస్తాం
పరిపూర్ణానంద స్వామి

హిందూపురం : నియోజకవర్గ వ్యాప్తంగా మరిన్ని గార్మెంట్స్ పరిశ్రమలు తీసుకొచ్చి ఉపాధి అవకాశాలు పెంపొందిస్తామని పరిపూర్ణానంద స్వామి తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం ఆయన పట్టణ సమీపంలో ఉన్న గార్మెంట్స్ పరిశ్రమలను సందర్శించి, మహిళా కార్మికుల సమస్యలను తెలుసుకున్నారు. పరిపూర్ణానందస్వామి వారితో మాట్లాడుతూ నియోజకవర్గం బెంగళూరు, అంతర్జాతీయ విమానాశ్రయానికి అతి చేరువలో ఉండడంతో ఎక్కువ పరిశ్రమలు రావాడానికి వీలుందన్నారు. అయితే పాలకుల నిర్లక్ష్యం వల్ల పరిశ్రమలు తీసుకురాలేకపోయారన్నారు. వచ్చే ఎన్నికల్లో ఈ ప్రాంత ప్రజలు తనను ఆశీర్వదిస్తే గార్మెంట్స్ పరిశ్రమలతో పాటు మరిన్ని పరిశ్రమలు తీసుకొచ్చి ఈ ప్రాంతాన్ని పారిశ్రామిక కారిడార్‌గా మారుస్తానన్నారు.

టిడిపి, వైసిపి పోటాపోటీ ప్రచారం

పుట్టపర్తి అర్బన్: ఎన్నికల పోలింగ్ సమయం దగ్గర పడే కొద్దీ టిడిపి, వైసిపి నాయకులు పోటాపోటీగా ప్రచారం చేస్తున్నారు. టిడిపి అభ్యర్థి పల్లె సింధూరారెడ్డి శనివారం మున్సిపాలిటీ పరిధిలోని ప్రశాంతి గ్రామ్‌లో ఇంటింటికే వెళ్లి చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తూ సైకిల్ గుర్తుకు ఓటు వేసి తనను ఎమ్మెల్యేగా బికె.పార్థసారధిని ఎంపిగా గెలిపించాలని అభ్యర్థించారు. ఆమె వెంట అంబులెన్స్ రమేష్, గణేష్‌చౌదరి, వెంకట రాముడు, పాల్గొన్నారు. వైసిపి అభ్యర్థి దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి తరపున ఆయన సతీమణి అపర్ణరెడ్డి పట్టణంలోని పెద్ద బజార్‌లో విస్తృతంగా ప్రచారం చేపట్టారు. ఆమె వెంట మున్సిపల్ ఛైర్మన్ తుంగ ఓబుళపతి, వుడా ఛైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ.

పోస్టల్ బ్యాలెట్ వినియోగంలో ఆందోళన వద్దు : కలెక్టర్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

పోస్టల్ బ్యాలెట్ వినియోగంలో ఉద్యోగులు ఆందోళన చెందవద్దని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అరుణ్‌బాబు సూచించారు. కలెక్టర్ శనివారం సాయంత్రం పట్టణంలోని చిన్నపల్లి ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ కేంద్రాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 7 అసెంబ్లీ నియోజకవర్గ ప్రధాన కేంద్రాల్లో పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులు ఎక్కడ పని చేస్తున్నా ఆ నియోజకవర్గ కేంద్రంలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ కేంద్రంలో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకోవచ్చు అన్నారు. ఇక్కడ శిక్షణ తరగతుల అనంతరం 250 మంది పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకున్నారన్నారు. మడకశిర నియోజకవర్గంలో 10 మంది, హిందూపురంలో 64, పెనుగొండలో 54, పుట్టపర్తిలో 55, ధర్మవరంలో 26, కదిరి నియోజకవర్గంలో 41 మంది పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకున్నారన్నారు. 6వ తేదీ కూడా ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవచ్చు అన్నారు. కలెక్టర్ వెంట ఆర్‌డీఓ భాగ్యరేఖ, తహశీల్దార్ వేణుగోపాల్, అధికారులు ఉన్నారు.

చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రాభివృద్ధి

నార్పల : మండలంలోని పులసలనూతల గ్రామంలో టిడిపి నాయకులు శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా టిడిపి నాయకులు ఆకుల బాబు ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి టిడిపి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు అంబికా లక్ష్మీనారాయణ, బండారు శ్రావణిశ్రీని గెలిపించాలని కోరారు. అంతేగాకుండా టిడిపి అధికారంలోకి వస్తే అమలు చేయనున్న సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఆకుల కిషోర్, అనిల్, రవితేజ, గంద్ర దాసు, పరందామ, నాగభూషణం, రాధాకృష్ణ, జనసేన నాయకులు రామకృష్ణ, భాస్కర్, లోకేష్ పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి

పోస్టల్ బ్యాలెట్ గందరగోళం

అందజేస్తామని జిల్లా అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో శిక్షణ నిమిత్తం ఉదయం 10 గంటలకు కదిరికి వచ్చిన అధికారులకు సాయంత్రం 7 గంటలు అయినా పోస్టల్ బ్యాలెట్ పత్రాలు ఇవ్వలేదు. దీంతో ఉద్యోగులు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. పోస్టల్ బ్యాలెట్ ఓటు వేసేందుకు సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన తమకు ఓటు వేసే అవకాశం కల్పించకపోవడంపై నిరసన తెలిపారు. రాత్రి ఏడుగంటలు అవుతున్నా ఓటు వేసే అవకాశం కల్పించకపోవడం ఏమిటంటూ ఎన్నికల అధికారులను నిలదీశారు. ఓటు వేసే అవకాశం లేనప్పుడు తమను ఎన్నికల విధులు నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల ఆందోళన నేపథ్యంలో 7 గంటల అనంతరం పోస్టల్ బ్యాలెట్‌ను అధికారులు తెప్పించారు. ఆ తరువాత ఓటింగ్ ప్రారంభం అయ్యింది.

ఎక్కడ ఓటు వేయాలంటూ తికమక

పోస్టల్ బ్యాలెట్ ఓటు వినియోగంలో కూడా తికమక పరిస్థితులు నెలకొన్నాయి. సత్యసాయి జిల్లాకు సంబంధించి ఎన్నికల విధులకు హాజరయిన ఉద్యోగులకు మాత్రమే పోస్టల్ బ్యాలెట్ ఓటు వేసే అవకాశాన్ని అధికారులు కల్పించారు. అనంతపురం జిల్లా పరిధి నుంచి వచ్చిన అనంతపురం గుంతకల్, కళ్యాణదుర్గం, రాయదుర్గానికి చెందిన పీవోలు, ఏపీవోలు ఆ జిల్లాలోనే ఓటు వేయాలంటూ అధికారులు తెలిపారు. దీంతో అనంతపురం జిల్లా ఉద్యోగులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.

విభజన హామీలపై స్పందించేరా..?

మొదటి క్యాంపస్ నిర్మాణం మాత్రమే జరగనుంది. ఇంకా పెద్దఎత్తున నిధులు కేటాయించాల్సి ఉంది. బెల్ పరిశ్రమను పాలసముద్రం ఏర్పాటు చేస్తామని శంకుస్థాపన చేశారు. 2015లో శంకుస్థాపన చేసే ఇప్పటికీ ప్రవహరీ నిర్మాణం వద్దనే ఆగిపోయింది. ప్రత్యేకంగా ధర్మవరం వరకు చూస్తే చేనేత అత్యధికంగా ఈ ప్రాంతంలో ఉంది. ప్రభుత్వ విధానాలు చేనేత రంగాన్ని పూర్తిగా దెబ్బతిస్తున్నాయి. చేనేత మగ్గాలపై నేసే 11 రకాలను మరమగ్గాల్లో నేయకూడదని సుప్రీంకోర్టు ఉత్తర్వులున్నా అమలు జరగడం లేదు. మరమగ్గాలు ధర్మవరంలో పూర్తి స్థాయిలో ఏర్పాటైపోయాయి. దీంతో చేనేత చేతిమగ్గాలు కనుమరుగయ్యే దశకు వచ్చాయి. వీటికితోడు జిఎస్టీ కూడా చేనేతకు మరింత సంక్షోభంలోకి నెట్టేసింది. కేంద్ర ప్రభుత్వం చేనేతపైనా జీఎస్టీ నుంచి మినహాయించాలని చాలా రోజులుగా చేనేత కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ఈ అంశాలపై కేంద్ర సహాయ మంత్రి అమిత్‌షా ఏ రకంగా స్పందిస్తారోనని జిల్లావాసులు ఎదురు చూస్తున్నారు. ఆదివారం నాడు ధర్మవరానికి అమిత్‌షా, చంద్రబాబు నాయుడు ఇద్దరూ ఎన్నికల ప్రచారంలో పాల్గొననున్నారు. ఈ సందర్భంగానైనా జిల్లాకు విభజన హామీల అమలుపై స్పందించి వెనుకబడిన ప్రాంతానికి నిధులు కేటాయించడంపై హామీనిస్తారా అని ఉమ్మడి అనంతపురం జిల్లా వాసులు ఎదురు చూస్తున్నారు.

నేడు సిపిఎం ప్రాంతీయ సభ

వారితో పాటు జిల్లాలో సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేస్తున్న ఇండియా వేదిక అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గం అభ్యర్థులు హాజరవుతున్నట్లు తెలిపారు. సార్వత్రిక ఎన్నికల్లో ఇండియా వేదిక అభ్యర్థుల గెలుపొందాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలో లౌకికతత్వాన్ని కాపాడాలంటే ఇండియా వేదిక అధికారంలోకి రావాలన్నారు. రాష్ట్రానికి రావాల్సిన ప్రత్యేక హోదా, బుందేల్ ఖండ్ తరహా ప్యాకేజీ, పోలవరం ప్రాజెక్టు పూర్తి, రాజధాని నిర్మాణానికి నిధులు, ఉపాధి కల్పనకు పరిశ్రమలు, జాతీయ సంస్థల రక్షణ తదితర వాటి కోసం ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు. జిల్లాలోని సిపిఎం నాయకులు, కార్యకర్తలు ప్రాంతీయ సభకు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

ప్రజాశక్తి
www.prajasakti.com
అనంతపురం
ఆదివారం 5
మే 2024

'అనంత'కు అపూర్వ స్వాగతం

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని 8వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించిన వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి అనంత వెంకటరామిరెడ్డికి శనివారం అడుగడుగునా అపూర్వ స్వాగతం లభించింది. మహిళలు హారతులు పట్టారు. ఇందులో భాగంగా ఐదేళ్లలో అనంతపురంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను అనంత వివరించారు. ఈ సందర్భంగా అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చాక ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. కావున ఆయా పథకాలు కొనసాగాలంటే ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి మరోసారి జగన్మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి చేసుకోవాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



అనంత వెంకటరామిరెడ్డికి గజమాలతో స్వాగతం పలుకుతున్న నాయకులు



పుట్టపర్తి పట్టం ఎవరికో..?

మూడు పార్టీల నడుమ ప్రధాన పోటీ - విజయంపై టిడిపి, వైసిపి, కాంగ్రెస్ ధీమా

-గెలుపు కోసం సర్వశక్తులూ ఒడ్డుతున్న అభ్యర్థులు

ఆధ్యాత్మిక కేంద్రం, శ్రీసత్యసాయి జిల్లా కేంద్రం అయిన పుట్టపర్తి నియోజకవర్గంలో రాజకీయ వేడి తారాస్థాయికి చేరింది. పుట్టపర్తి జిల్లా కేంద్రం అయిన తర్వాత తొలిసారిగా సార్వత్రిక ఎన్నికలు జరుగుతున్నాయి. గత ఎన్నికలకు భిన్నంగా టిడిపి, వైసిపి, కాంగ్రెస్ పార్టీలు గెలుపు కోసం నువ్వా, నేనా అన్నట్లు పోటీ పడుతున్నాయి. గెలుపే లక్ష్యంగా పోటాపోటీగా ప్రచారం నిర్వహిస్తున్నాయి. గెలుపునకు అవసరమయ్యే అన్ని అస్త్రాలను ఉపయోగిస్తున్నారు. అధికార, ప్రతిపక్ష నాయకులు ఇప్పటికే కింది స్థాయి నాయకులను తమవైపు తిప్పకున్నారు. టిడిపి, వైసిపి రెండు పార్టీల అభ్యర్థులు పగలు ప్రచారాలు, రాత్రి పూట మంతనాలు చేస్తున్నారు. వామపక్ష పార్టీల మద్దతుతో ఇండియా వేదిక అభ్యర్థిగా కాంగ్రెస్ కూడా పుట్టపర్తి నుంచి గట్టిపోటీనే ఇస్తోంది. ప్రత్యామ్నాయం కోరుకుంటున్న ప్రజలకు తాము అండగా ఉంటామని కాంగ్రెస్ భరోసానిస్తూ ప్రచారంలో ముందుకు సాగుతోంది. త్రిముఖ పోరు నడుమ పోటీపోటీగా సాగుతున్న ప్రచారాలతో పుట్టపర్తి ఎవరికి దక్కుతుందన్న అంచనాలను ప్రజలు బేరీజు వేస్తున్నారు.

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్



దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

పల్లె సింధూర

మధుసూదన్‌రెడ్డి

పల్లె స్థానంలో కోడలు సింధూర

పుట్టపర్తి నియోజకవర్గంతో పల్లె రఘునాథరెడ్డికి ప్రత్యేక అనుబంధం ఉంది. ఈ నియోజకవర్గం నుంచి రెండు పర్యాయాలు ఆయన ఎమ్మెల్యేగా గెలిచి, మంత్రి కూడా అయ్యారు. గడిచిన ఎన్నికల్లో గెలిచి హ్యాట్రిక్ సాధించాలనుకున్నారు. ఆ ఎన్నికల్లో వైసిపి అభ్యర్థి చేతిలో పల్లె ఓటమి చవిచూశారు. ఇక 2024 ఎన్నికల్లో టిడిపి అధిష్టానం పల్లె స్థానంలో ఆయన కోడలు పల్లె సింధూరను అభ్యర్థిగా ప్రకటించింది. ఈమె గెలుపు కోసం పల్లె రఘునాథరెడ్డి నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో విస్తృత ప్రచారాలు చేస్తున్నారు. ఇప్పటికే టిడిపిలో అసమ్మతి నాయకులను పల్లె దారికి తెచ్చుకున్నారు. పుట్టపర్తి జిల్లా కేంద్రంలో మంచి ఓటు బ్యాంకు ఉన్న నాయకులను తిరిగి టిడిపిలోకి ఆహ్వానించారు. పుట్టపర్తికి చెందిన రామ,లక్ష్మణ్, పిసి.గంగన్న, పెదరాజు సుబ్రమణ్యం తదితరులు ఇటీవలే పల్లె రఘునాథరెడ్డికి మద్దతు తెలిపారు. ఈ నాయకుల రాకతో తెలుగుదేశం పార్టీకి కొంత ఊపునిచ్చింది. వైసిపి నుంచి కూడా కొందరు ద్వితీయ శ్రేణి నాయకులు టిడిపిలో చేరారు. కాగా పల్లె రఘునాథరెడ్డిపై అసమ్మతి కూడా అదేస్థాయిలో ఉంది. పల్లె కుటుంబం ఎమ్మెల్యే అభ్యర్థిత్వాన్ని సవాల్ చేస్తూ అదే నియోజకవర్గానికి చెందిన కొందరు నాయకులు బాహాటంగానే విమర్శలు గుప్పించారు. అయితే టిడిపి అభ్యర్థిని ప్రకటించిన తర్వాత పల్లెపై అసమ్మతి ప్రకటించిన చాలా మంది నేతలు మెత్తబడ్డారు. అయితే ముందునుంచి పల్లెపై అసమ్మతితో ఉన్న నేతలు ఆయన గెలుపునకు ఎంత మేర పని చేస్తారన్నదే ప్రశ్నార్థకంగా మారింది. గతాన్ని మర్చిపోయి గెలుపు కోసం పని చేస్తారా.. లేక తూతూమంత్రంగా ప్రచారాల్లో పాల్గొని మమ అనిపిస్తారాని ఆ పార్టీ శ్రేణుల్లో సందేహం వ్యక్తం అవుతోంది. పల్లె మాత్రం అసమ్మతి నేతలను కలుపుకుంటూ పోతూనే తన కోడలు సింధూరను ఈ సారి గెలిపించుకోవాలని ముమ్మరంగానే ప్రయత్నం చేస్తున్నారు. పల్లె రఘునాథరెడ్డి, ఆయన కుమారుడు పల్లె వెంకట క్రిష్ణకిషోర్‌రెడ్డి, కోడలు, అభ్యర్థి పల్లె సింధూరారెడ్డి అన్ని గ్రామాల్లో ఓటర్లను స్వయంగా కలిసి ఓట్లు అభ్యర్థిస్తున్నారు.

రెండోసారి కోసం 'దుద్దుకుంట' ప్రయత్నం

పుట్టపర్తి వైసిపికి ముఖ్య నేతగా ఉన్న తాజా ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి రెండవ సారి ఆ పార్టీ అభ్యర్థిగా ఎన్నికల బరిలో నిలిచారు. వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న శ్రీధర్‌రెడ్డి రెండవ సారి ఎలాగైనా గెలవాలన్న సంకల్పంతో జోరుగా ప్రచారం చేస్తున్నారు. ఐదేళ్ల కాలంలో సంక్షేమ పథకాల ద్వారా చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరిస్తూ మరోసారి తనను గెలిపించాలని ఓటర్లను కోరుతున్నారు.

వైసిపి పుట్టపర్తి టికెట్ కేటాయించే ముందు చాలా మంది పుట్టపర్తి వైసిపి నాయకులు ఆయనకు వ్యతిరేకంగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని కలిశారు. పుట్టపర్తి టికెట్ ఈసారి శ్రీధర్‌రెడ్డికి కాకుండా ఇతరులకు ఇవ్వాలని తెలిపారు. అయినా అధిష్టానం శ్రీధర్‌రెడ్డికే టికెట్టును కేటాయించింది. టికెట్ వచ్చిన తర్వాత శ్రీధర్‌రెడ్డి అసమ్మతి నేతలను కలుపుకునే ప్రయత్నం చేస్తున్నారు. నియోజవర్గంలో వైసిపి ముఖ్య నేతలుగా ఉన్న కొత్తకోట సోమశేఖర్‌రెడ్డి, లోచర్ల విజయభాస్కర్‌రెడ్డి, పాముదుర్తి ఇంద్రజిత్తు రెడ్డి తదితరులు ఇప్పటికీ శ్రీధర్‌రెడ్డితో కలిసి రావడం లేదు. ఈ పరిణామాలు వచ్చే ఎన్నికల్లో వైసిపికి ఎలాంటి నష్టాన్ని తెస్తాయన్నది వేచి చూడాలి. శ్రీధర్‌రెడ్డి మాత్రం వైసిపి ప్రభుత్వం చేసిన సంక్షేమ పాలన రెండవ సారి తనను ఎమ్మెల్యేను చేస్తుందన్న ధీమాను వ్యక్తం చేస్తున్నారు.

కాంగ్రెస్ గట్టి పోటీ

పుట్టపర్తి నియోజకవర్గం నుంచి ఈ సారి కాంగ్రెస్ కూడా బలమైె అభ్యర్థినే బరిలో నిలిపింది. వామపక్షాల మద్దతుతో ఇండియా వేదిక నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా అమడగూరు మండలం కె.కొత్తపల్లి గ్రామానికి చెందిన దాదిరెడ్డి మధుసూదన్‌రెడ్డి పోటీలో ఉన్నారు. సిపిఎం, సిపిఐ, ప్రజాసంఘాల మద్దతుతో ఆయన నియోజకవర్గం వ్యాప్తంగా విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. గతంతో పోలిస్తే కాంగ్రెస్‌కు ఈ ఎన్నికల్లో ప్రజల నుంచి పెద్ద ఎత్తునే మద్దతు లభిస్తోంది. టిడిపి, వైసిపిలతో విసిగిపోయిన ప్రజలు ప్రత్యామ్నాయంగా కాంగ్రెస్ వైపు చూస్తున్నారని ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు.

మధుసూదన్‌రెడ్డి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయం నుంచి రాజకీయాల్లో క్రియాశీలకంగా ఉన్నారు.

నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఆయనకు వ్యక్తిగతంగా పరిచయాలు ఉండడం కలిసొచ్చే అంశంగా ఉంది. అధికార, ప్రతిపక్ష పార్టీల్లోని అసమ్మతి నేతలను తనవైపు తిప్పుకునే ప్రయత్నం చేస్తున్నారు. కాంగ్రెస్‌కు వామపక్ష పార్టీలు తోడవడం అదనపు బలాన్ని ఇస్తోంది.

గడిచిన ఐదేళ్లల్లో సిపిఎం, సిపిఐలు ప్రజా సమస్యలపై అనేక పోరాటాలు చేసి అందులో విజయం సాధించారు. ఈ పోరాటాలు ఓట్ల రూపంలో కాంగ్రెస్‌కు లాభం చేకూర్చే అవకాశం కన్పిస్తోంది.

పుట్టపర్తి నియోజకవర్గం ఏర్పాటు తర్వాత గెలిచిన అభ్యర్థులు

సం॥	గెలిచిన అభ్యర్థి	పార్టీ	ప్రత్యర్థి	పార్టీ
2009	పల్లె రఘునాథరెడ్డి	టిడిపి	కె.మోహన్‌రెడ్డి	కాంగ్రెస్
2014	పల్లె రఘునాథరెడ్డి	టిడిపి	సి.సోమశేఖర్‌రెడ్డి	వైసిపి
2019	దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి	వైసిపి	పల్లె రఘునాథరెడ్డి	టిడిపి

ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందాం : సిపిఎం

ఎన్నికల ప్రచారం చేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-వజ్రకరూరు

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించుకుని దేశంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందామని సిపిఎం వజ్రకరూరు మండల కన్వీనర్ విరుపాక్షి, జిల్లా కమిటీ సభ్యులు రంగారెడ్డి, కృష్ణమూర్తి పిలుపునిచ్చారు. శనివారం వజ్రకరూరు, విడపనకల్ మండల కేంద్రాలతోపాటు చాబాల, పొట్టిపాడు గ్రామాల్లో ఇండియా కూటమి అభ్యర్థులకు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి పదేళ్లుగా కేంద్ర, రాష్ట్రాల్లో ఏర్పడిన ప్రభుత్వాల వైఫల్యాలను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పది సంవత్సరాల కాలంలో కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరిస్తోందన్నారు. ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజల జీవితాలతో చెలగాటం ఆడుతోందని విమర్శించారు. అదేవిధంగా రాష్ట్రంలో కూడా వైసిపి, టిడిపి ప్రభుత్వాలు బిజెపికి కొమ్ముకాస్తూ ప్రజా సమస్యలను పక్కన పెట్టాయన్నారు. కేవలం బిజెపి చెప్పే విధానాలను అనుసరిస్తూ పేదలపై భారం వేస్తున్నాయన్నారు. కేంద్రంతోపాటు రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం కావాలంటే కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేస్తున్న ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు మధుసూదన్‌రెడ్డి, మల్లికార్జునను గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ ప్రచార కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు రంగా, సుధాకర్, నరసింహులు, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

అండగా నిలిచాం..ఆశీర్వదించండి..

ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు వై.విశ్వేశ్వరరెడ్డి, శంకరనారాయణ

ప్రజాశక్తి-బెలుగుప్ప

'ఐదేళ్ల పాలనలో అన్నివిధాలుగా అండగా నిలిచాం.. ఎన్నికల్లో ఓటు వేసి ఆశీర్వదించండి' అని అంటూ వైసిపి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు వై.విశ్వేశ్వరరెడ్డి, శంకరనారాయణ విజ్ఞప్తి చేశారు. శనివారం మండలంలోని జీడిపల్లి, వీరాంజనేయకొట్టాల, కోనంపల్లి, హనిమరెడ్డిపల్లి, కాలువపల్లి గ్రామాల్లో అహుడా ఛైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్, వైసిపి జిల్లా అధ్యక్షులు పైలా నరసింహయ్యతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకున్న ముఖ్యమంత్రి ఒకవైపు, హామీలను తుంగలో తొక్కి మోసం చేసిన చంద్రబాబు ఒక వైపు ఉన్నారన్నారు. ఎవరు కావాలో ప్రజలే ఆలోచించి నిర్ణయం తీసుకోవాలన్నారు. ప్రజల మంచి కోసం తాము అనేక కార్యక్రమాలు చేస్తూ ముందుకుపోతుంటే ఇక్కడ ఎమ్మెల్యేగా గెలిచిన పయ్యావుల కేశవ్ పత్తా లేకుండా పోయాడన్నారు. ఇప్పుడు ఎన్నికలు రావడంతో మళ్లీ మీ వద్దకు వస్తున్నాడన్నారు. కరోనాతో ప్రజలు తల్లడిల్లిపోతున్న సమయంలో కూడా కేశవ్ ప్రజలను గాలికొదిలేశాడన్నారు. తాను మాత్రం అన్ని రకాలుగా నియోజకవర్గ ప్రజలకు అండగా నిలిచానని గుర్తు చేశారు. మరోసారి ప్రజలకు సేవ చేసుకునే అవకాశాన్ని కల్పించాలని కోరారు. అదేవిధంగా జీడిపల్లి ముంపు బాధితులకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పరిహారం ప్రకటించారని, ఎన్నికల కోడ్ కారణంగా అది ఆగిపోయిందన్నారు. వచ్చేది మన ప్రభుత్వమేనని ఎన్నికల అయిపోయిన వెంటనే ముంపు బాధితులకు పరిహారం అందజేసి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు వీరన్న, పెద్దన్న, రామాంజనేయులు, త్రిలోక్‌నాథ్‌రెడ్డి, చిన్న మచ్చన్న, శ్రీనివాసులు, శివలింగప్ప, జి.శ్రీనివాసులు, జయరామేశ్వరరెడ్డి, రామిరెడ్డి, హనుమంతురాయుడు, వెంకటేశులు, పెద్దన్న, తదితరులు పాల్గొన్నారు.

వైసిపి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు శంకరనారాయణ, విశ్వేశ్వరరెడ్డికి గజమాలతో స్వాగతం పలుకుతున్న నాయకులు, కార్యకర్తలు

వజ్రకరూరు : ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిత్యం పోరాడే వైసిపి అభ్యర్థి విశ్వేశ్వరరెడ్డిని గెలిపించుకుంటేనే అభివృద్ధి సాధ్యమని వైసిపి యువజన విభాగం జోనల్ ఇన్‌ఛార్జి వై.ప్రణయ్‌రెడ్డి తెలిపారు. శనివారం ఉరవకొండలోని చౌడేశ్వరి కాలనీ, శాంతినగర్, సాయినగర్‌లలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి పాలనకు, వైసిపి పాలనకు మధ్య తేడాను గమనించాలన్నారు. ఐదేళ్లలో ప్రభుత్వం ద్వారా మీ ఇంటికి లబ్ధి చేకూరి ఉంటేనే ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు.

అలాగే మండల పరిధిలోని నింబగల్లు గ్రామంలో వైసిపి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు వై.విశ్వేశ్వర్‌రెడ్డికి, శంకరనారాయణకు మద్దతుగా ఎంపిటిసి సోంపల్లి ఈశ్వర్ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ వచ్చే ఎన్నికల్లో వైసిపికి ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచి సునీత ఓబులేష్, నాయకులు చిదంబరం నాయుడు, జెట్టి రమేష్, రామస్వామి, బండారి సీనప్ప, వెంకటేశులు, హనుమప్ప, వన్నూరప్ప, సుంకన్న, వన్నప్ప, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి నాయకులను నమ్మొద్దు

ఎంపీ అభ్యర్థి శంకరనారాయణ

ప్రజాశక్తి-నార్పల

ఎన్నికల సమయంలో మాత్రమే కనిపించే టిడిపి నాయకులను నమ్మొద్దని వైసిపి ఎంపీ అభ్యర్థి శంకరనారాయణ సూచించారు. శనివారం మండల కేంద్రంలో ఎమ్మెల్యే అభ్యర్థి వీరాంజనేయులుతో కలిసి రోడ్‌షో నిర్వహించారు. నార్పల తిక్కస్వామి ఆలయం నుంచి ప్రారంభమైన రోడ్‌షో పలు కాలనీల మీదుగా సాగింది. ఈ సందర్భంగా వైసిపి అధికారంలోకి వచ్చాక అమలు చేయనున్న పథకాల గురించి వివరిస్తూ ముందుకు సాగారు. అనంతరం శంకరనారాయణ మాట్లాడుతూ టిడిపి నాయకుల మోసపు హామీలపై జాగ్రత్తగా ఉండాలన్నారు. వచ్చే ఎన్నికల్లో ఓటు రూపంలో తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ప్రజలకు ఇంటి వద్దకే ప్రభుత్వ పాలన తీసుకొచ్చి సంక్షేమ పథకాలను అందిస్తున్న జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రి చేసుకోవాలన్నారు. కావున ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా వీరాంజనేయులు, ఎంపీగా తనని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా అధ్యక్షుడు పైలా నర్సింహయ్య, అహుడా ఛైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాసులు, ప్రభుత్వ విద్యా సలహాదారులు ఆలూరు సాంబశివారెడ్డి, సీనియర్ నాయకులు నార్పల సత్యనారాయణరెడ్డి, నిట్టూరు రఘునాథరెడ్డి, ఎర్రిస్వామిరెడ్డి, నాగేశ్వరరావు, నాగరత్నమ్మ, సుప్రియ, లోకనాథ్‌రెడ్డి, మొరుసు రమణారెడ్డి, సంజీవరెడ్డి, భాస్కర్‌రెడ్డి, దిద్దికుంట కేశవరెడ్డి, మిద్దె కుళ్లాయప్ప, వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వైసిపి నాయకులు

ప్రమాదంలో ప్రజాస్వామ్యం, రాజ్యాంగం

కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వై మధుసూదన్‌రెడ్డి

ప్రజాశక్తి-వజ్రకరూరు

పదేళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి పాలనలో ప్రజాస్వామ్యం, భారత రాజ్యాంగానికి భద్రత కరువైందని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వై.మధుసూదన్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం ఉరవకొండ పట్టణంలోని రంగావీధి, 10వ వార్డు, సివివి నగర్, మూగ బసప్ప కట్ట తదితర ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే అమలు చేయనున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి పాలనలో కేవలం బడాబాబులకు మేలు జరిగింది తప్ప, బడుగు బలహీన వర్గాలు, రైతులకు ఎలాంటి ప్రయోజనాలూ అందలేదన్నారు. అధికార దాహంతో బిజెపి ప్రభుత్వం మత రాజకీయాలు చేస్తూ రాష్ట్రాల్లో శాంతి భద్రతలకు విఘాతం కల్పించేలా వ్యవహరిస్తోందన్నారు. శాంతిభద్రతలకు వివాదం కల్పించే బిజెపితోపాటు కీలుబొమ్మలుగా ఉన్న రాష్ట్రంలోనే వైసిపి, టిడిపి నాయకులకు కూడా ఓటుతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కాగా పలువురు బిజెపి నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి మధుసూదన్‌రెడ్డి కండువాలు కప్పి ఆహ్వానించారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో శేఖర్, కార్తీక్, శివ, సురేంద్ర, సూరి, కిరణ్, హనుమంతు, సన్నీ, రాజశేఖర్, సాయి, తదితరులు ఉన్నారు. అదేవిధంగా వజ్రకరూరు మండలం పరిధిలోని రూపానాయక్, జయరామ్‌నాయక్, కుమార్‌నాయక్, సోమ్లానాయక్ తదితరులు కాంగ్రెస్‌లో చేరారు. ఇకపోతే మధుసూదన్‌రెడ్డి తనయుడు అవినాష్‌రెడ్డి కూడేరు మండల పరిధిలోని అంతర్ గంగ గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

మహిళను ఓటు అభ్యర్థిస్తున్న మధుసూదన్‌రెడ్డి

మీ చేతుల్లోనే అభివృద్ధి.. ఆలోచించండి..: దగ్గుపాటి

దగ్గుపాటి ప్రచారానికి అనూహ్య స్పందన-ప్రత్యేక ఆకర్షణగా సినీనటుడు అంబటి శ్రీనివాస్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

నగరం అభివృద్ధి చెందాలన్నా.. రాష్ట్రంలో మార్పు రావాలన్నా.. నిర్ణయం మీ చేతుల్లోనే ఉందని, వ్యాపార వర్గాలు ఆలోచించి నిర్ణయించి ఓట్లు వేయాలని అనంతపురం అర్బన్ టిడిపి అభ్యర్థి దగ్గుపాటి ప్రసాద్ విజ్ఞప్తి చేశారు. శనివారం నగరంలోని కమలానగర్‌లో ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణతో కలిసి నిర్వహించిన ఎన్నికల ప్రచారానికి విశేష స్పందన లభించింది. ప్రచారంలో ముఖ్య అతిథిగా హాజరైన సినీనటుడు అంబటి శ్రీనివాస్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ సందర్భంగా దగ్గుపాటి మాట్లాడుతూ అనంతపురం నగరం అభివద్ధి కోసం ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. ఇప్పటి వరకు నగరంలో ఎలాంటి పరిస్థితులు ఉన్నాయో అర్థం చేసుకోవాలన్నారు. వ్యాపార వర్గాల నుంచి తమ విశేష స్పందన కనిపిస్తోందని కచ్చితంగా వారంతా టీడీపీ వైపు ఉన్నారన్నారు. నేడు టీడీపీ అధినేత చంద్రబాబు అనంతపురం రానున్నారని ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ నగరంలో ఉన్న అధ్వాన్న పరిస్థితులు పోవాలంటే దగ్గుపాటిని గెలిపించాలన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ, డంపింగ్ యార్డు తరలింపు, ఔటర్ రింగ్ రోడ్డు వంటి పనులు వేగవంతంగా జరుగుతాయన్నారు.

టిడిపిలోకి చేరిన వారితో దగ్గుపాటి ప్రసాద్

టిడిపిలో పలు కుటుంబాలు చేరిక

నగరంలోని 24 డివిజన్ నవోదయ కాలనీలోని పలు కుటుంబాలు టిడిపిలో చేరారు. ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుపాటి సమక్ష్యంలో టిడిపిలో చేరారు. వారిని టిడిపి కండావాలు వేసి పార్టీలోకి స్వాగతించారు. పార్టీలో చేరిన వారిలో 24 డివిజన్ కీలక నాయుడు అశోక్ కుమార్, బెస్త సంఘం నాయకుడు బెస్త చంద్రబాబు, ఉమర్ ముక్తార్, బీసీ సంక్షేమ సంఘం రాయలసీమ యువజన ధ్యక్షులు జశ్వంత్ వ్యాస్ ఆధ్వర్యంలో పలు కుటుంబాలు చేరారు. రోజు రోజుకూ టిడిపిలోకి వలసలు పెరుగుతున్నాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి చేసుకోవడానికి చేయి చేయి కలిపేందుకు రాజకీయాలకు అతీతంగా టిడిపిలోకి చేరుతున్నారని తెలిపారు. తమ గెలుపు తధ్యమని, మెజారిటి కోసమే ప్రచారం అంటూ ధీమా వ్యక్తం చేశారు.

వైసిపి మోసపూరిత హామీలను నమ్మొద్దు

ఎన్నికల ప్రచారంలో సురేంద్రబాబుకు నాగలి బహూకరించిన కార్యకర్తలు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

వైసిపి నాయకుల మోసపూరిత హామీలను మరోసారి నమ్మి మోసపోవద్దని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు సూచించారు. శనివారం పట్టణంలోని వివిధ కాలనీల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి పాలనలో అరాచకాలు, దాడులు, దౌర్జన్యాలు పెరిగిపోయాయన్నారు. ముఖ్యంగా వివిధ రకాల పన్నులు, ఛార్జీలను పెంచి పేదల నడ్డి విరిచారన్నారు. అలాగే మద్యపాన నిషేధం చేస్తామని చెప్పి చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి సామాన్యులను జైలుపాలు చేశారన్నారు. ఇలాంటి దౌర్భాగ్య పాలనకు మరోసారి ఓటు వేస్తే రావణాసురుని రాజ్యం కొని తెచ్చుకున్నట్లేనని స్పష్టం చేశారు. పదెకాల పైబడి ఒక సెంటు భూమి ఉన్నా పెన్షన్లు, రేషన్ కార్డులు నిర్ధాక్షణంగా తొలగించిన ఘనత సీఎం జగన్‌కే దక్కిందన్నారు. భూసర్వే పేరుతో రైతులను మోసగిస్తూ భూముల రికార్డులను తారుమారు చేసి గ్రామాల్లో చిచ్చు పెట్టించారని విమర్శించారు. ఇలాంటి మోసపూరిత పాలకులు మనకు అవసరమా.. అన్నారు. కావున అభివృద్ధికి చిరునామా అయిన ఎన్‌డిఎ అభ్యర్థులను ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఛైర్మన్ వైపి.రమేష్, నాయకులు శర్మాస్, వెలుగు లోకేష్, తదితరులు పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్ వేసవి శిక్షణ శిబిరానికి హాజరైన క్రీడాకారులు

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

ధర్మవరం టౌన్ : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని బాస్కెట్‌బాల్ అసోసియేషన్ పట్టణ ఆర్గనైజింగ్ సెక్రటరీ శెట్టిపి జయచంద్రారెడ్డి, కార్యదర్శి హిదయతుల్లా సూచించారు. పట్టణం లోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఆత్మీయ ట్రస్టు సహకారంతో బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత బాస్కెట్‌బాల్ వేసవి శిక్షణ కార్యక్రమాన్ని శనివారం వారు ప్రారంభించారు. శిక్షణ ఉదయం 6 నుంచి 8 గంటల వరకూ, సాయంత్రం 4-30 నుంచి 6-30 గంటల వరకు ఉంటుందన్నారు. కార్యక్రమంలో కోచ్ సంజయ్, క్రీడాకారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతు రుణమాఫీ

ముదిగుబ్బ : రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే వెంటనే రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తుందని ధర్మవరం ఎమ్మెల్యే అభ్యర్థి రంగన అశ్వర్థనారాయణ తెలిపారు. ఆయన శనివారం సిపిఐ, సిపిఎం శ్రేణులతో కలిసి ముదిగుబ్బలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు రుణమాఫీతో పాటు వికలాంగులకు రూ. 6వేలు, వృద్ధులకు రూ. 4వేలు పింఛను ఇస్తుందన్నారు. మహిళలకు సముచిత స్థానం కల్పించి ఆర్థికంగా బలోపేతమయ్యేలా చర్యలు చేపడుతుందన్నారు. కార్యక్రమంలో సిపిఐ, సిపిఎం నియోజకవర్గ నాయకులు మధు, జంగాలపల్లి పెద్దన్న, సిపిఐ మండల కార్యదర్శి చల్లా శ్రీనివాసు లు, సీనియర్ నాయకులు కృష్ణయ్య, రైతు సంఘం నాయకులు అమర్నాథ్‌చౌదరి, తుమ్మల చిన్నప్ప, శంకర, రాధాకృష్ణ, చెన్నప్ప పాల్గొన్నారు.

టిడిపి నాయకుల విస్తృత ప్రచారం

కొత్తచెరువు రూరల్ : మండలంలోని తలమర్ల ఎస్సీ, ఎస్టీ కాలనీలు, పాత దేవరపల్లి గ్రామాల్లో శనివారం టిడిపి నాయకులు విస్తృత ప్రచారం నిర్వహించారు. వారు ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు ప్రకటించిన సూపర్‌సిక్స్ కరపత్రాలను పంపిణీ చేశారు. ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా పల్లె సింధూరరెడ్డిని, ఎంపిగా బికె.పార్థసారథిని భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థిం చారు. ప్రజల్లో టిడిపికి విశేష స్పందన వస్తుందని, కూటమి అధికారం చేపట్టడం ఖాయమన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి బడుగు, బలహీన, బిసి, మైనార్టీ వర్గాలకు మొండిచేయి చూపిందని తెలిపారు. ఆయా వర్గాలకు న్యాయం జరగాలంటే టిడిపిని గెలిపించుకోవాలని కోరారు. అలాగే గుంటిపల్లి, మామిళ్లకుంట క్రాస్‌లో ఎమ్మెల్యే అభ్యర్థి పల్లె సింధూరరెడ్డి ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ రామకృష్ణ, పట్టణ కన్వీనర్ వలిపి శ్రీనివాసులు, లోచర్ల పెద్దన్న, సుబ్బయ్య, బాబు, జనసేన మండల కన్వీనర్ పూల శివప్రసాద్, మేడాపురం సల్లప్ప, గంగాదేవి, మారుతి, నరేంద్ర పాల్గొన్నారు.

ఈవిఎంపై పీవో, ఏపీవోలకు శిక్షణ

ప్రజాశక్తి-హిందూపురం

సార్వత్రిక ఎన్నికల కోసం నియమించిన పిఓ, ఏపిఓలకు శనివారం జిల్లా జాయింట్ కలెక్టర్, రిటర్నింగ్ అధికారి అభిషేక్ కుమార్ ఆధ్వర్యంలో పట్టణంలోని కొట్నూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాస్టర్ ట్రైనర్ల చేత శిక్షణ ఇచ్చారు. శిక్షణ కార్యక్రమాన్ని జనరల్ అబ్జర్వర్ అన్బుకుమార్ పరిశీలించారు. ట్రైనర్లు ఈవిఎం యంత్రాలను ఎలా ఉపయోగించాలి, స్టిక్కరింగ్ ఎలా వేయాలి అని వివరించారు. శిక్షణలో తహశీల్దార్ శివప్రసాద్, మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పిఓ, ఏపిఓలతో మాట్లాడుతున్న జనరల్ అబ్జర్వర్ అన్బుకుమార్

టిడిపి అధికారంలోకి వస్తే పేదలకు మరింత లబ్ధి

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

టిడిపి అధికారంలోకి వస్తే పేదలకు మరింత లబ్ధి చేకూరుతుందని, వారి ఆదాయాన్ని మరింత పెంచేందుకు కృషి చేస్తామని పల్లె వెంకట కృష్ణ కిషోర్‌రెడ్డి తెలిపారు. పుట్టపర్తి టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పల్లె సింధూరరెడ్డికి మద్దతుగా శనివారం ఆయన మండలంలోని దిగువ చెర్లోపల్లి, గంగిరెడ్డిపల్లి, సాధార్లపల్లిలో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పల్లె కిషోర్‌పై స్థానిక ప్రజలు పూల వర్షం కురిపిస్తూ స్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ టిడిపి అధికారంలోకి రాగానే చంద్రబాబు మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల ఫైలుపై తొలి సంతకం చేస్తారన్నారు. రైతులకు ఏటా రూ. 20వేలు పంట పెట్టుబడి కోసం అందజేస్తారన్నారు. జగన్ ప్రభుత్వం తీసుకొచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు ఫైలుపై రెండో సంతకం చేస్తారని తెలిపారు. ప్రతి ఓటరూ సైకిల్ గుర్తుకు ఓటు వేసి పల్లె సింధూరరెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఆయన వెంట నాయకులు గంగిరెడ్డిపల్లి వెంకటరెడ్డి, పెడపల్లి శ్రీరామనాయక్, గడ్డం కృష్ణనాయక్, కుళ్లాయప్ప, శివప్ప, నారాయణస్వామి, రామంజి, జగన్, రామయ్య, రామ సుబ్బారెడ్డి, నాగిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, మహానంద, డాక్టర్ రాఘవేంద్ర, జనసేన నాయకులు శ్యాంసుందర్, వెంకటేష్‌నాయక్, కార్యకర్తలు ఉన్నారు.

జగన్‌ను ఇంటికి పంపేందుకు ప్రజలు సిద్ధం

పుట్టపర్తి : గత ఐదేళ్లలో రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసిన వైఎస్.జగన్మోహన్‌రెడ్డిని ఇంటికి పంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని పల్లె వెంకట కృష్ణ కిషోర్ రెడ్డి తెలిపారు. ఆయన శనివారం బుక్కపట్నం మండలంలోని గసిగవారిపల్లి గ్రామ పంచాయతీలో టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పల్లె సింధూరరెడ్డికి మద్దతుగా వినూత్నంగా ఎద్దుల బండిపై ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలకు ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. పుట్టపర్తి నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే టిడిపితోనే సాధ్యమని, పల్లె సింధూర రెడ్డి ఎమ్మెల్యే అయిన వెంటనే నియోజకవర్గానికి మరింత గుర్తింపు తెస్తారని తెలిపారు. ప్రచారంలో మండల కన్వీనర్ మలిరెడ్డి, నాయకులు శివారెడ్డి, బొట్టు కిష్టప్ప, భాస్కర్‌రెడ్డి, గోపాలపురం గంగాధర్, టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎద్దుల బండిపై ప్రచారం నిర్వహిస్తున్న పల్లె కృష్ణ కిషోర్ రెడ్డి

రాష్ట్రంలో కూటమిదే అధికారం:పల్లె

పుట్టపర్తి : సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు అత్యధిక సాధనాల్లో విజయం సాధించడం, ప్రభుత్వం ఏర్పాటు చేయడం తథ్యమని మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి పేర్కొన్నారు. పల్లె సమక్షంలో శనివారం బుక్కపట్నంలో వాలంటీర్ వరలక్ష్మి కుటుంబంతో పాటు, కాంట్రాక్టర్ బాబు తదితరులు టిడిపిలో చేరారు. పల్లె మాట్లాడుతూ ప్రజలు కూటమి మేనిఫెస్టోను విశ్వసించారని, కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందని నమ్మి కూటమి అభ్యర్థులను గెలిపించేందుకు సంసిద్ధంగా ఉన్నారని తెలిపారు. పార్టీలో చేరిన వారికి సముచిత స్థానం కల్పిస్తానని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పేదరాశి సుబ్రహ్మణ్యం, చిన్న కృష్ణ, జంగం వెంకట్రాముడు, లావణ్యగౌడ్, సంజీవరాయుడు, సయ్యద్‌బాషా, మీసాల మురళి, భాస్కర్ రాయల్, సురేష్, మన్సూర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే ప్రత్యేక హోదా సాధ్యం

రొద్దం : సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా పెనుకొండ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే, హిందూపురం ఎంపి అభ్యర్థులు శనివారం మండలంలోని బొక్కసంపల్లి, తురకలాపట్నం, పెద్దకోడిపల్లి గ్రామాలతోపాటు, రొద్దం పరిధిలోని గ్రామాల్లో జోరుగా ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే అభ్యర్థి బోయ నర్సింహులు ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. వారు మాట్లాడుతూ కాంగ్రెస్‌ను గెలిపిస్తే ఎపికి ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు చేస్తుందన్నారు. గతంలో కాంగ్రెస్ పాలనలో ప్రజలకు గృహాలు, ఇంటి పట్టాలు, తదితర సంక్షేమ పథకాలు అందించామనిముఖ్య అతిథి పిసిసి ఉపాధ్యక్షులు కెటి.శ్రీధర్ పేర్కొన్నారు. ప్రచారంలో వెంకట్రామిరెడ్డి, పరిగి మండల కన్వీనర్ ఈశ్వరప్ప, రొద్దం మండల కన్వీనర్ ప్రకాశ్‌రెడ్డి, సోమందేపల్లి మండల కన్వీనర్ గంగాధర్, సీనియర్ నాయకులు గోవిందప్ప, దస్తగిరిసాబ్, నరసింహులు, చంద్ర, రాజగోపాల్‌నాయుడు, సంజీవరెడ్డి, బోయ వెంకటరమణ, నాగమ్మ, మున్నా, సిపిఐ, సిపిఎం నాయకులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్‌తో అందరికీ లబ్ధి : టిడిపి

సోమందేపల్లి : పెనుకొండ మండలంలోని నాగలూరు పంచాయతీలో శనివారం మాజీ జడ్పీటీసీ, టిడిపి సీనియర్ నాయకులు నారాయణస్వామి ఆధ్వర్యంలో తెలుగుతమ్ముళ్లు ముమ్మరంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సూపర్‌సిక్స్ కరపత్రాలు పంపిణీ చేశారు. ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా సవితమ్మను, హిందూపురం ఎంపిగా బికె.పార్థసారథిని భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో కేశవయ్య, సూర్యనారాయణ, లక్ష్మీనారాయణరెడ్డి, ప్రసాద్, శ్రీనివాసులు, హనుమంతురెడ్డి, మహమ్మద్, బి.ప్రభాకర్ రెడ్డి, వెంకారెడ్డి, లక్ష్మన్న, రామాంజప్ప, వంశీ, శివ, అంజి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కరపత్రాలు పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు

వైసిపి నాయకుల ఎన్నికల ప్రచారం

సోమందేపల్లి : పెనుకొండ మండలంలోని గోనిపెంట గ్రామంలో శనివారం వైసిపి మండల ప్రజా ప్రతినిధులు, నాయకులు ఎన్నికల ప్రచారం విస్తృతంగా చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి గత ఐదేళ్ల పాలనలో సిఎం జగన్ అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు అందాలంటే మరోమారు వైసిపిని ఆదరించాలని కోరారు. ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా ఉషశ్రీచరణ్‌ను, ఎంపిగా బోయ శాంతమ్మను భారీ మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో ఎంపిపి గీతారామ్మోహన్‌రెడ్డి, దుద్దేబండ సర్పంచి గౌతమి శ్రీకాంత్‌రెడ్డి, మండల కన్వీనర్ నాగలూరు బాబు, రాజగోపాల్‌రెడ్డి, వినోద్‌కుమార్, సుధాకర్ నాయక్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కరపత్రాలు పంపిణీ చేస్తున్న వైసిపి నాయకులు

సెబ్ డిప్యూటీ కమిషనర్ విస్తృత తనిఖీలు

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

మండలంలోని బ్రాహ్మణపల్లి సమీపంలో ఉన్న ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ ను శనివారం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో డిప్యూటీ కమిషనర్ టి.విజయ్‌శేఖర్ సందర్శిం చారు. ఆయన స్టేషన్‌లోని రికార్డులను పరిశీలిం చారు. కేసుల వివరాలు, వాటి పరిష్కారాలపై ఆరా తీశారు. ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని పోలీసులు అప్రమత్తంగా ఉండాలని, అక్రమం గా మద్యం రవాణా చేసే మార్గాల్లో ప్రత్యే కంగా తనిఖీలు నిర్వహించాలన్నారు. విధుల్లో అలస త్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికల కమిషన్ నిబంధనలకు లోబడి విధులు నిర్వర్తించాలని, ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి పని చేయరాదని సూచించారు. ఆయన వెంట అసిస్టెంట్ సూపరింటెండెంట్ బి.సుబ్రహ్మణ్యం, జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి, పుట్టపర్తి ఎయిర్‌పోర్ట్ సిఐ కన్నయ్య, ఎస్ఐతో పాటు సిబ్బంది ఉన్నారు.

సెబ్ కార్యాలయం తనిఖీ

ధర్మవరం టౌన్ : పట్టణంలోని సెబ్ స్టేషన్‌ను అనంతపరానికి చెందిన సెబ్ డిప్యూటీ కమిషనర్ విజయశేఖర్ శనివారం సందర్శించారు. ఆయన స్టేషన్‌లో కేసుల పురోగతి, రికార్డులు, ప్రాపర్టీని తనిఖీ చేసి సిబ్బం దికి సూచనలిచ్చారు. ఆయన మాట్లాడుతూ అక్రమంగా మద్యం, నాటుసారా, మత్తుపానీయాల అమ్మ కాలు జరగకుండా చూడాలన్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎవరైనా అక్రమంగా మద్యం, నాటు సారా నిల్వ ఉంచినా, అమ్మినా కఠినచర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయనతో పాటు సెబ్ సిఐ గురుప్రసాద్ ఉన్నారు.

తూమకుంట చెక్‌పోస్ట్ తనిఖీ

హిందూపురం : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఆంధ్ర సరిహద్దులో తూమకుంట వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్టును శనివారం సెబ్ డిప్యూటీ కమిషనర్ విజయ్ శేఖర్ సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఎన్నికల్లో ఓటర్లకు పంపిణీ చేసేందుకు మద్యం, డబ్బు, తదితర వస్తువులను కర్నాటక నుంచి అక్రమంగా సరఫరా చేసే అవకాశాలు ఉన్నాయని, చెక్‌పోస్టులో ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా సోదా చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో సెబ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కూటమి హామీలు నమ్మి మోసపోవద్దు

పుట్టపర్తి వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీధర్‌రెడ్డి

కొత్తచెరువు రూరల్ : కూటమి నేతల మాటలు విని మోసపోవద్దని పుట్టపర్తి వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీధర్‌రెడ్డి ఓటర్లకు సూచించారు. ఆయన శనివారం మండలంలోని లోచర్ల గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించగా ప్రజలు బ్రహ్మరథం పట్టారు. అడుగడుగునా పూలమాలలు, హారతులతో స్వాగతం పలికారు. ఆయన రోడ్ షోలో మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపిగా బోయ శాంతమ్మను భారీ మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. తాను ఇప్పటికే నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేశానని, మరింత అభివృద్ధి చేయడానికి మరో అవకాశం ఇవ్వాలని కోరారు.

రోడ్ షో నిర్వహిస్తున్న శ్రీధర్‌రెడ్డి

ఉపాధ్యాయుడు సస్పెన్షన్

పుట్టపర్తి : గోరంట్ల మండలంలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఎంబి.ఆదినారాయణ ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించడంతో సస్పెండ్ చేసినట్లు డిఇఒ మీనాక్షి శనివారం తెలిపారు. ఆది నారాయణ ఎన్నికల శిక్షణ తరగతులకు హాజరుకాకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించినం దుకు గోరంట్ల హెచ్‌ఎం, ఎంఇఒ సమర్పించిన నివేదిక మేరకు ఆయనను విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు డిఇఒ తెలిపారు.

టిడిపి ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ

నల్లచెరువు : మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన టిడిపి నాయకులు, కార్యకర్తలు స్థానిక సాయిబాబా గుడి నుంచి కమ్మవారిపల్లి, ఎనుములవారిపల్లి, నల్లచెరువు గ్రామాల మీదుగా పెద్దఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ టిడిపిని స్థాపించిన అనతికాలంలోనే ఎన్టీఆర్ అధికారం చేపట్టి ప్రజల కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టి పేదలకు దగ్గరయ్యాడన్నారు. నిరుపేదల అభివృద్ధికి అహర్నిశలు కృషి చేసిన మహనీయుడు ఎన్టీఆర్ అన్నారు. అనంతరం పలువురు వైసిపి నాయకులు టిడిపిలో చేరినట్లు మండల కన్వీనర్ రాజశేఖర్ తెలిపారు. ర్యాలీలో మహబూబ్‌సాబ్, నాగభూషణ్‌నాయుడు, అశ్వత్థనాయుడు, లక్ష్మీపతినాయుడు, శివారెడ్డి, నాగరాజు, కరుణాకర్, జింకా లక్ష్మీనారాయణ, అబ్దుల్ ఖాదర్, అల్లాబకాష్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ప్రశాంతతే లక్ష్యం

రాప్తాడు టిడిపి అభ్యర్థి పరిటాల సునీత

పరిటాల సునీతకు పూలమాల వేసి స్వాగతం పలుకుతున్న నాయకులు

ప్రజాశక్తి-చెన్నేకొత్తపల్లి

గ్రామాల్లో ప్రశాంత వాతావరణం కల్పించడమే మా ఉద్దేశ్యం అని, అందుకే తాజా మాజీ ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి సోదరులు దాడులు చేస్తున్నా కొన్నిసార్లు భరించామని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పరిటాల సునీత పేర్కొన్నారు. ఆమె శనివారం మండలంలోని పులేటిపల్లి, కోటంపల్లి, పైలబోయలపల్లి, నరసింగరాయునిపల్లి, ఓబుళంపల్లి, ప్రసన్నాయపేట, ఆమిదాలకుంట, నాగిశెట్టిపల్లి, కనుముక్కల గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించగా ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ఆమె రోడ్ షోలతో పాటు ఇంటింటికీ వెళ్లి సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. అలాగే టిడిపి హయాంలో ఆయా గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను గుర్తుచేశారు. గత ఐదేళ్లలో ఏం అభివృద్ధి జరిగిందో ఒక్కసారి చూసుకోవాలన్నారు. 2019లో సానుభూతి మాటలు, దొంగ ఓట్లతో గెలిచిన ప్రకాష్‌రెడ్డి లక్ష ఎకరాలకు నీరు ఇచ్చామని పచ్చి అబద్ధాలు చెబుతున్నారన్నారు. మేము పేరూరు ప్రాజెక్టుకు నీరు తెస్తామని, నియోజకవర్గంలో ప్రతి ఎకరాకు నీరందించే ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చామని పనులు కూడా ప్రారంభించామన్నారు. అధికారం పోవడం వల్ల ఆయా పనులు ఎక్కడివక్కడే ఆగిపోయాయి అన్నారు. ఈ సారి వచ్చేది టిడిపినే అని పేరూరు ప్రాజెక్టుకు నీరిస్తామని తెలిపారు. పరిటాల కుటుంబం మాట ఇచ్చిందంటే దానికి కట్టుబడి ఉంటుందన్నారు. తాను మంత్రిగా ఉన్నప్పుడు దాడులు చేయాలనుకుంటే మీరు బయటకు వచ్చేవారా అని నిలదీశారు. ఇప్పటివరకు సహించామని ఇకనై కార్యకర్తల జోలికి వస్తే సహించేది లేదన్నారు. ప్రజలంతా ఆలోచించుకుని ఎవరు న్యాయం చేస్తారో వారికే ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. 'నాయకుడంటే మాట మీద నిలబడాలి.. ఎన్నికల కోసం హామీలు ఇవ్వడం.. ఆ తర్వాత అంతా చేసినట్టు ప్రజలను మభ్య పెట్టడం సరైంది కాదని ప్రకాష్‌రెడ్డికి పరిటాల సునీత చురకలంటించారు.

టిడిపి మేనిఫెస్టో విడుదల చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎస్ రాజు

టిడిపి మేనిఫెస్టోతో అన్నివర్గాలకు లబ్ధి

ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎస్ రాజు

మడకశిర : టిడిపి మేనిఫెస్టోతో అన్నివర్గాలకు లబ్ధి చేకూరుతుందని ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎస్ రాజు పేర్కొన్నారు. చంద్రబాబు ప్రకటించిన ఎన్నికల మేనిఫెస్టోను శనివారం పట్టణంలోని బాలాజీ నగర్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి, ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎస్.రాజు, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌మూర్తి విడుదల చేశారు. వారు మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలను ఆదుకోవడానికి చంద్రబాబు సూపర్ మేనిఫెస్టోను విడుదల చేశారని, ప్రతిఒక్కరూ మేనిఫెస్టోను అభినందిస్తున్నారని తెలిపారు. ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీలు ప్రతి ఒక్కరినీ ఆదుకోవాలనే ఉద్దేశంతో చంద్రబాబు బిజెపి, జనసేనతో కలిసి మేనిఫెస్టోను విడుదల చేశారన్నారు. ఈ నెల 13వ తేదీ ప్రతి ఓటరూ సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా ఎంఎస్ రాజుని, ఎంపిగా బికె.పార్థసారధిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం ఎంఎస్ రాజు జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి పంచి పెట్టారు.

రాష్ట్రాన్ని గాడిన పెట్టడమే కూటమి లక్ష్యం

ధర్మవరం టౌన్ : వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సాగించిన అప్రజాస్వామిక పాలన ద్వారా దెబ్బతిన్న రాష్ట్రాన్ని గాడిన పెట్టేందుకే కూటమి ఏర్పడిందని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి సత్యకుమారయాదవ్ పేర్కొన్నారు. ఆయన శనివారం పట్టణంలోని రాంనగర్, గుట్టకిందపల్లి, తారకరామాపురం, సాయినగర్, యాదవవీధి, పార్థసారధినగర్‌లో కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. వారు ఇంటింటికీ వెళ్లి ఉమ్మడి మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల ను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ చందమూరి నారాయణరెడ్డి అనుచరులు గరుగు మల్లికార్జున, రాజు, చింతా మంజునాథ, రాజు, సుధాకర్, నారాయణస్వామి, నారాయణ, శీన, షాషా, జయకృష్ణ, పవన్, జస్వంత్, ప్రకాశ్, మోహన్, గోపాల్, హరితో పాటు 25 కుటుంబాలు బిజెపిలో చేరగా సత్యకుమార్ పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు.

కూటమి గెలుపు అభివృద్ధికి మలుపు : కందికుంట

ప్రజాశక్తి-కదిరి టౌన్

రాష్ట్రంలో వచ్చే ఎన్నికల్లో టిడిపి, జనసేన, బిజెపి కూటమి గెలుపు రాష్ట్ర అభివృద్ధికి మలుపు అని ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. ఆయన శనివారం రూరల్ మండలంలోని కాలసముద్రం పంచాయతీలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గత ఐదేళ్లలో రాష్ట్ర ప్రజలను అన్ని విధాలా మోసం చేసిన వైసిపికి ఓటుతో బుద్ధి చెప్పాలని ప్రజలను కోరారు. కందికుంటకు మహిళలు అడుగడుగునా హారతులు పట్టగా నాయకులు పూలమాలలు వేసి ఘన స్వాగతం పలికారు.

ప్రజా సంక్షేమమే 'కందికుంట' ఆశయం

ప్రజా సంక్షేమం కాంక్షించే నాయకుడు కందికుంట వెంకటప్రసాద్ అని, ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ఆయన సతీమణి యశోదాదేవి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం ఆమె పట్టణంలోని 5వ వార్డులో టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంటకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కూటమి మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి, జనసేన నాయకులు కిన్నెర మహేష్, అనురాధ, రాజశేఖర్, నాగప్ప, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రచారం చేస్తున్న టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట

ప్రత్యేక పంచాయతీలుగా తండాల అభివృద్ధి

గిరిజన తండాలను ప్రత్యేక పంచాయతీలుగా ఏర్పాటు చేసి అభివృద్ధి చేస్తామని, గిరిజన యువత నాయకత్వాన్ని ప్రోత్సహిస్తా మని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. కందికుంట శనివారం కదిరి రూరల్ మండలంలోని ఏటిగడ్డ తండా, రాచవారిపల్లితండా, వీరేపల్లి పేటలో ఎన్నికల ప్రచారం నిర్వహించా రు. ముందుగా మహిళలు హారతులు ఇచ్చి ఘన స్వాగ తం పలకగా అడుగడుగునా ప్రజలు బ్రహ్మరథం పట్టారు. రైతులు, ప్రజలు నీరు, విద్యుత్, తదితర సమస్యలను కందికుంట ఎదుట ఏకరువు పెట్టారు. వాటిపై స్పందించిన కందికుంట 'నెల రోజులు ఓపిక పట్టండి.. అధైర్య పడొద్దు.. కూటమి ప్రభుత్వం ఏర్పడుతుంది సమస్యలన్నీ పరిష్కరిస్తాం మీకు అండగా నేను ఉంటానని తండావాసులకు భరోసా కల్పించారు. అలాగే ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరిస్తూ ముందుకు సాగారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ తండాలో 500 జనాభా ఉంటే గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసి మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. గిరిజన యువత నాయకత్వాన్ని ప్రోత్సహిస్తామన్నారు. వైసిపి ప్రభుత్వం తండాలను విస్మరించిందన్నారు. ఎన్‌డిఎ కూటమి అధికారంలోకి రాగానే ఆయా సమస్యలను పరిష్కరించే బాధ్యత తీసుకుంటామన్నారు. ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపిగా బికె.పార్థసారధిని భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. ఆయన వెంట మండల కన్వీనర్ చెన్నకేశవులు, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

పెడపల్లిలో ప్రచారం చేస్తున్న శ్రీధర్‌రెడ్డి

వైసిపిని గెలిపిస్తేనే సంక్షేమ పథకాల అమలు

ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీధర్‌రెడ్డి

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

సార్వత్రిక ఎన్నికల్లో వైసిపిని గెలిపించి మళ్లీ జగన్‌ను ముఖ్యమంత్రిని చేస్తేనే సంక్షేమ పథకాలు ఇంటి వద్దకు వస్తాయని ఎమ్మెల్యే అభ్యర్థి దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన శనివారం మండలంలోని పెడపల్లి గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామంలో ప్రతి గడపకూ వెళ్లి అభివృద్ధి, సంక్షేమ పథకాలతో పాటు జగన్ ప్రకటించిన నూతన మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. గత ఐదేళ్లలో జగన్ నాయకత్వంలో పుట్టపర్తి నియోజక వర్గాన్ని గొప్పగా అభివృద్ధి చేసుకున్నామని తెలిపారు. ఎన్నికల వేళ ప్రజలను మభ్యపెట్టడానికి మోసపూరిత హామీలతో కూటమి నేతలు వస్తున్నారని, పచ్చ పార్టీ చెప్పే అబద్ధపు హామీలను నమ్మి మోసపోవద్దనీ సూచించారు. ఈ నెల 13వ తేదీ జరిగే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి, వేయించి ఎమ్మెల్యేగా తనను, ఎంపిగా బోయ శాంతమ్మని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఆయన వెంట స్థానిక వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం

టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి సవితమ్మ

ప్రజలను ఓట్లు అభ్యర్థిస్తున్న టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి సవితమ్మ

ప్రజాశక్తి-గోరంట్ల

రాష్ట్రాభివృద్ధి చంద్ర బాబుతోనే సాధ్యమని పెనుకొండ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి సవితమ్మ పేర్కొన్నారు. ఆమె శనివారం మండ లంలోని పాలసముద్రం, రెడ్డిచెరువు పల్లి, వడిగేపల్లి గ్రామపంచా యతీ ల్లోని గ్రామాల్లో రోడ్ షో ద్వారా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సవితమ్మ మాట్లాడుతూ రాష్ట్రం అభివద్ధి చెందాలన్నా, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కాలన్నా టిడిపి అధినేత చంద్రబాబుతోనే సాధ్యమవుతుంద న్నారు. వైసిపి హయాంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక యువత కర్నాటక, తదితర ప్రాంతాలకు వలస పోయారన్నారు. టిడిపి హయాంలో పెనుకొండ సమీపంలో కియా పరిశ్రమ రావడం వల్ల 20వేల మందికి ఉద్యోగావకాశాలు వచ్చాయన్నారు. జగన్ ప్రభుత్వంలో గ్రామాల్లో అభివృద్ధి శూన్యం అన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి నన్ను ఎమ్మెల్యేగా, బికె.పార్థసారధిని ఎంపిగా అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆమె ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ సోమశేఖర్, నాయకులు మనోహర్, బెల్లాలచెరువు చంద్ర, రాజారెడ్డి, సర్పంచి నరసింహమూర్తి, శ్రీనివాసులు, జీనువాండ్లపల్లి నరేంద్ర, యువశేఖర్, వేణు రాయల్ పాల్గొన్నారు.

వైసిపి నుంచి టిడిపిలో చేరిక

ధర్మవరం టౌన్ : మండలంలోని ధర్మపురి, నాగులూరు గ్రామాలకు చెందిన 65 కుటుంబాలు వైసిపికి గుడ్ బై చెప్పి పరిటాల శ్రీరామ్ సమక్షంలో టిడిపిలో చేరారు. అనంతపురం నగరంలోని పరిటాల శ్రీరామ్ స్వగహంలో శనివారం వారికి టిడిపి కండువా వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. శ్రీరామ్ మాట్లాడుతూ ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల గెలుపు కోసం పని చేయాలని సూచించారు. కష్టపడి పని చేసిన వారికి పార్టీలో సముచిత స్థానం కల్పించే బాధ్యత నాదే అన్నారు. వచ్చేది టిడిపి ప్రభుత్వమేనని ఎలాంటి సంకోచం వద్దన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మహేష్‌చౌదరి, మాజీ జడ్పిటిసి మేకల రామాంజనేయులు, మండల ప్రధాన కార్యదర్శి విజయసారథిచౌదరి, భాస్కర్‌చౌదరి, విజయ్‌చౌదరి పాల్గొన్నారు.

టిడిపి కండువా వేసి ఆహ్వానించిన పరిటాల శ్రీరామ్

పరిశ్రమలు స్థాపించి యువతకు ఉపాధి కల్పిస్తాం

కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి దాదిరెడ్డి మధుసూదన్‌రెడ్డి

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

నియోజకవర్గంలో పరిశ్రమలు స్థాపించి యువత వలస వెళ్లకుండా ఇక్కడే ఉపాధి కల్పిస్తామని ఇండియా వేదిక అభ్యర్థి మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ఆయన శనివారం అమడగూరు మండలంలోని మలకవారిపల్లి, ఎగువతండా, తుమ్మలగోపాల్‌నాయక్ తండా, తదితర గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేశారు. ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీని వ్యవసాయానికి అనుసంధానం చేసి అటు కూలీలకు ఇటు రైతులకు ఉపాధి కల్పిస్తామన్నారు. రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ, అర్హులందరికీ రూ. 5 లక్షలతో పక్కా ఇందిరమ్మ గృహం, మహిళలకు ఏడాదికి రూ. లక్ష ఇస్తామన్నారు. నియోజకవర్గంలోని చెరువులను సాగునీటితో నింపి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామన్నారు. హస్తం గుర్తుకు ఓటు వేసి ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో నల్లమాడ మండల కన్వీనర్ పటాన్ గౌస్‌బాషా, నాయకులు సంతోష్‌రెడ్డి, వాసుదేవరెడ్డి, నరేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ఓట్లు అడుగుతున్న దాదిరెడ్డి మధుసూదన్‌రెడ్డి

పుట్టపర్తి విమానాశ్రయంలో సిఎంకు ఘన స్వాగతం

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

హిందూపురం పర్యటన సందర్భంగా శనివారం జిల్లాకు వచ్చిన సిఎం జగన్‌కు పుట్టపర్తి విమానాశ్ర యంలో వైసిపి శ్రేణులు ఘన స్వాగతం పలికారు. జగన్ ఉదయం 10.55 గంటలకు గన్నవరం నుంచి ప్రత్యేక విమానంలో పుట్టపర్తి విమానాశ్రయం చేరుకున్నారు. ఇక్కడి నుంచి 11: 10 గంటలకు ప్రత్యేక హెలికాప్టర్‌లో హిం దూపురం బయల్దేరి వెళ్లారు. పుట్టపర్తి విమానాశ్రయంలో పెద్దిరెడ్డి రామచం ద్రారెడ్డి, పుట్టపర్తి ఎమ్మెల్యే అభ్యర్థి దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ ఛైర్మన్ రత్నాకర్, వైసిపి నాయకులు వడ్డే వేణుగోపాల్, సంస్కృతి కళాశాల కరస్పాండెంట్ విజయకు మార్, గోపాల్‌రెడ్డి జగన్‌కు పుష్పగుచ్ఛం అందజేసి ఘన స్వాగతం పలికారు. సిఎం పర్యటన నేపథ్యంలో విమానాశ్రయ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్‌ను బైపాస్ వైపు మళ్లించారు. సిఎం రాక సందర్భంగా విమానాశ్రయం చుట్టూ గట్టి భద్రతా ఏర్పాట్లు చేశారు.

సిఎం జగన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న శ్రీధర్ రెడ్డి

ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించండి

సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్

ప్రజాశక్తి- చిలమత్తూరు

సార్వత్రిక ఎన్నికల్లో ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్ ప్రజలను కోరారు. ఇండియా వేదిక ఆధ్వర్యంలో శనావారం మండల వ్యాప్తంగా విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. చిలమత్తూరులోని సంత మార్కెట్‌లో కరపత్రాలు పంపిణీ చేసి ప్రజలను ఓట్లు అభ్యర్థించారు. ఇంతియాజ్ మాట్లాడుతూ ఎన్నికల్లో వైసిపికి ఓటు వేసినా, ఎన్‌డిఎ కూటమిగా చెప్పబడే టిడిపికి ఓటు వేసినా బిజెపికి ఓటు వేసినట్లే అన్నారు. బి అంటే బాబు, జె అంటే జగన్, పి అంటే పవన్ అన్నారు. కేంద్రంలో మరోసారి బిజెపి అధికారంలో వస్తే పేదలు, మధ్య తరగతి ప్రజలు రోడ్డున పడతారన్నారు. మోడీ ప్రభుత్వం విధానాలతో ఇప్పటికే దేశ వ్యాప్తంగా మత విద్వేశాలు పెరిగిపోయి దేశ ఐక్యతను దెబ్బతీసే పరిస్థితులు దాపురించాయన్నారు. ఇది దేశ రక్షణకు మంచిది కాదన్నారు. భూ యాజమాన్య హక్కు చట్టం పేరుతో వైసిపి పేదల భూములకు రక్షణ లేకుండా చేసిందని, ఫలితంగా పేదల భూములు బడాబాబుల చేతుల్లోకి వెళ్తున్నాయని ఇది చాలా ప్రమాదకరం అన్నారు. ఇంకోసారి వైసిపి అధికారంలోకి వస్తే పేదల చేతిలో సెంటు భూమి కూడా ఉండదన్నారు. కావున ప్రతి ఓటరూ ఎన్నికల్లో హస్తం గుర్తుకు ఓటు వేసి హిందూపురం ఎమ్మెల్యేగా ఎంహెచ్ ఇనాయతుల్లాను, ఎంపిగా సాహిన్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్ పార్టీలుగా అభ్యర్థిస్తున్నామని తెలిపారు. ఇండియా వేదిక అధికారంలోకి వస్తే మహిళలకు ఏడాదికి రూ. లక్ష, రూ. 500కే గ్యాస్ సిలిండర్, తదితర అద్భుతమైన సంక్షేమ పథకాలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి ఇనాయతుల్లా, సీనియర్ నాయకులు అబ్దుల్ గౌస్, సిపిఎం నాయకులు ప్రవీణ్ కుమార్, వెంకటేష్, లక్ష్మినారాయణ, సిపిఐ నాయకులు దాదాపీర్, తదితరులు పాల్గొన్నారు.

సంత మార్కెట్‌లో ఓట్లు అభ్యర్థిస్తున్న కాంగ్రెస అభ్యర్థి ఇనాయతుల్లా , ఇంతియాజ్

కాంగ్రెస్ గెలుపుతోనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి

సిడబ్ల్యుసి మెంబర్ రఘువీరారెడ్డి

ప్రజాశక్తి-మడకశిర

సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపిస్తే ఎపి అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందని సిడబ్ల్యుసి మెంబర్, మాజీ మంత్రి ఎన్.రఘువీరారెడ్డి తెలిపారు. ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా శనివారం రఘువీరా నియోజకవర్గంలోని ఐదు మండలాల బూత్ ఇన్‌ఛార్జులతో పట్టణంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ముందుగా రొళ్ల, అగళి, అమరాపురం, గుడిబండ, మడకశిర మండలాల బూత్ ఇన్‌ఛార్జులతో నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కె.సుధాకర్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. రఘువీరా మాట్లాడుతూ ఉమ్మడి ఎపిలో దివంగల సిఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో నియోజకవర్గ అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందన్నారు. ఈ ఎన్నికల్లో కె.సుధాకర్‌ను ఎమ్మెల్యేగా గెలిపిస్తే నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు తాగునీటి సౌకర్యం, వలసల నివారణకు ఇండస్ట్రియల్ ఏరియాలో పరిశ్రమలు ఏర్పాటు చేస్తామన్నారు. నియోజక వర్గం లోని అన్ని చెరువులకు హంద్రీనీవా ద్వారా సాగునీరు అందించడానికి కృషి చేస్తామన్నారు. అర్థాంతరం గా నిలిచిపోయిన రైల్వే పనులను పూర్తి చేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. కార్యక్రమంలో మండల కన్వీనర్లు గౌడప్ప, లోకేష్, గురుమూర్తి, మందలపల్లి నాగరాజు, మంజునాథ్, బాబు, నాయకులు బచ్చలయ్యపాలెం నరసింహమూర్తి, ప్రభాకర్‌రెడ్డి, భయపురెడ్డి పాల్గొన్నారు.



బూత్ ఇన్‌ఛార్జులతో సమావేశమైన రఘువీరారెడ్డి

సంక్షేమం, అభివృద్ధికి పట్టం కట్టాలి : కేతిరెడ్డి

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

సంక్షేమం, అభివృద్ధికి పట్టం కట్టాలని వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ప్రజలను కోరారు. కేతిరెడ్డి శనివారం పట్టణంలోని 25, 26, 27, 28వ వార్డుల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయనకు ముందుగా మహిళలు మంగళహారతులు ఇచ్చి, గుమ్మడి కాయలతో దిష్టి తీస్తూ అభిమానం చాటుకున్నారు. ఆయన స్థానిక వైసిపి శ్రేణులతో కలిసి ఇంటింటికీ వెళ్లి గత ఐదేళ్లలో జగన్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, ఎమ్మెల్యేగా తాను నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. అలాగే వైసిపి నూతన మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. సంక్షేమ పాలన కొనసాగాలంటే ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపిగా బోయ శాంతమ్మను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. స్థానిక ఎర్రగుంట వై జంక్షన్ సర్కిల్ నుంచి ఎల్‌సికె పురం, వైఎస్సార్ కాలనీ, ఇందిరమ్మ కాలనీల మీదుగా కేతిరెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలో 25వేల మందికి ఇంటి పట్టాలు ఇచ్చామన్నారు. శివారు ప్రాంతాల్లో ఇళ్లు కాదు ఊళ్లు నిర్మించామన్నారు. టిడిపి హయాంలో ఒక్క ఇంటి పట్టా కూడా ఇచ్చిన పాపాన పోలేదన్నారు. చంద్రబాబు ఆచరణ సాధ్యం కాని హామీలతో మోసం చేసేందుకు వస్తారని ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. కేతిరెడ్డి వెంట జడ్పీ వైస్ ఛైర్మన్ కామిరెడ్డిపల్లి సుధాకర్‌రెడ్డి, మేడాపురం సూరి, సరితాల బాషా, మేడాపురం వెంకటేశ్, రామకృష్ణ, రంగ, పురుషోత్తంరెడ్డి, ప్రకాష్, కోటిరెడ్డి బాలిరెడ్డి, చిల్లావారి భాస్కర్‌రెడ్డి, సాయికుమార్, పెణుజూరు నాగరాజు, కృష్ణాపురం జమీర్ అహ్మద్, సరితాల ఆశాబీ, గజ్జల శివ, బడన్నపల్లి కేశవరెడ్డి, ఎస్పీ బాషా, చింతా భాస్కర్‌రెడ్డి, సుబాన్, గడ్డం కుమార్, చందు, బొంత సురేందర్రెడ్డి, రవీంద్రరెడ్డి పాల్గొన్నారు.

ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి కేతిరెడ్డి

ఎండవేడి-ప్రచార వేడి..!

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

మే మాసం మొదలవడంతో ఎండ తీవ్రత మరింత పెరిగింది. ఉదయం ఎనిమిది గంటల నుంచే ఎండ వేడిమి ఊపందుకుంటోంది. ప్రతి రోజూ ఎండ తీవ్రత 44 డిగ్రీలకుపైగా చేరుతోంది. మధ్యాహ్నం సమయంలో అయితే వడగాల్పులు విపరీతంగా ఉంటున్నాయి. జనం బయటకు రావాలంటే కూడా భయపడిపోతున్నారు. రాత్రి సమయాల్లోనూ చల్లదనం ఏర్పడటం లేదు. ఏప్రిల్, మే మాసాల్లో పడే తేలికపాటి వాన చినుకు కూడా జాడ లేకపోవడంతో ఎప్పుడు వర్షపు చినుకు నేలరాలుతుందోనని జనం ఎదురు చూస్తున్నారు. ఎండ తీవ్రత ఇలాగుంటే రాజకీయ ప్రచార వేడి మరోవైపు పెరిగింది. ఇక ఎన్నికలకు సమయం ఆసన్నమవుతుండటంతో ఈ వారంలో ప్రచారాలు మరింత ఊపందుకున్నాయి. ఎండ వేడిమిని సైతం లెక్క చేయకుండా అభ్యర్థులు ప్రజలను కలుసుకునేందుకు పరుగులు పెడుతున్నారు. జనాన్ని ఎప్పుడు కలవడానికి వీలవుతుందో అప్పుడే ఇళ్ల వద్దకెళ్లి ఓట్లు అభ్యర్థిస్తున్నారు. ఇదే సమయంలో పార్టీల మార్పులు జోరందుకున్నాయి. ఈ మారే సమయంలో కొన్ని నియోజకవర్గాల్లో నేతల మధ్య వివాదాలు చెలరేగుతున్నాయి. ఎన్నికల తరువాత మీ కథ చూస్తామంటూ బాహాటంగానే ఒకొరిద్దరు నేతలు బెదిరింపులకు సైతం దిగుతున్న ఘటనలు చోటు చేసుకున్నాయి. ఉమ్మడి జిల్లాలో ముఖ్యనేతల పర్యటనలు పెరిగాయి. ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి తాడిపత్రిలో సభలో పాల్గొనిప్రచారం నిర్వహించారు. తాజాగా శనివారం నాడు సత్యసాయి జిల్లాలోని హిందూపురం పర్యటనకు విచ్చేశారు. వచ్చే వారంలో టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు జిల్లా పర్యటనకు విచ్చేయనున్నట్టు తెలుస్తోంది. ఇక ఇండియా ఐక్య వేదిక నాయకుల ప్రచారాలు ఊపందుకున్నాయి. అనంతపురం నగరంలో సిపిఐ అభ్యర్థి జాఫర్ విజయాన్ని కాంక్షిస్తూ సిపిఎం, సిపిఐ, కాంగ్రెసు నాయకులు ప్రచారాలు నిర్వహిస్తున్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ అనంతపురం నగరంలో ప్రచారాన్ని నిర్వహించారు. ఆదివారం నాడు సిపిఎం కేంద్ర పొలిట్‌బ్యూరో సభ్యులు బేవి, సిపిఐ జాతీయ కార్యదర్శి అంజాద్ పాషా, కాంగ్రెస్ ఎఐసిసి సభ్యులు ఎన్.రఘువీరారెడ్డిలు అనంతపురం నగరంలో జరిగే సిపిఎం సభలో పాల్గొంటారు. ఇలా ముఖ్యమైన పార్టీల నాయకులంతా ప్రచార కార్యక్రమాల్లో పాల్గొనేందుకు విచ్చేస్తున్నారు. ఇదే సమయంలో నేతల కొనుగోళ్లు, ఓట్లకు డబ్బులు సర్దుబాటు చేసుకోవడాలు వేగవంతమయ్యాయి. ఈ రకంగా డబ్బులు తరలిస్తూ అనంతపురం నగరంలో రెండు కోట్ల వరకు పట్టుబడింది. ఇక పట్టుబడకుండా నేతల ఇళ్లకు చేరుతున్నది ఎంతో లెక్కలేకుండా ఉంది. ఎన్నికల సమయం ఆసన్నమవుతుండటంతో అధికార యంత్రాంగం పూర్తి స్థాయి కసరత్తుకు సిద్ధమవుతోంది. పోలింగుకు అవసరమైన శిక్షణను విడతల వారీగా పూర్తి చేస్తున్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓటింగు కూడా మొదలయింది. వాటిని సాధ్యమైనంతగా ఎక్కువ సాధించుకునేందుకు నాయకులు కసరత్తు ముమ్మరం చేశారు. తమకు అనుకూలంగాన్న వారీ ద్వారా పోస్టల్ బ్యాలెట్ ఓట్లు తమకు అనుకూలంగా పడే విధంగా చూసుకునేందుకు సర్వశక్తులు ఒడ్డుతున్నారు. ఏది ఏమైనా ఈ వారంలో రాజకీయ వేడి పెరిగింది. వచ్చే వారానికి ఇది తీవ్ర రూపం దాల్చే అవకాశాలున్నాయి. ప్రచారాలు మరింత ముమ్మరమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి.

జగన్ పాలనలో ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు

కదిరి వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి బిఎస్.మక్బూల్

ప్రజాశక్తి-గాండ్లపెంట

సిఎం జగన్ పాలనలో లబ్ధిదారు లకు ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందాయని కదిరి వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి బిఎస్.మక్బూల్ అహ్మద్ పేర్కొన్నారు. ఆయన శనివారం మండలంలోని మద్దివారి గొంది, వేపరాల, తాళ్లకాల్వ, సిఎం తండా, కురమామిడి, చామలగొంది, కత్తివారి పల్లి, సోమయాజుల పల్లి, వేపకుంట, తదితర గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సంక్షేమ సారధి జగన్ మరోసారి ముఖ్యమంత్రి అవ్వడానికి ప్రజలందరూ ఆశీర్వదించాలని కోరారు. జగన్ దేశంలోనే ఎక్కడా లేని విధంగా వినూత్నంగా సచివాలయాల వ్యవస్థ ప్రవేశపెట్టి ప్రజలు సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించారన్నారు. నాడు-నేడులో భాగంగా విద్య, వైద్య రంగాల అభివృద్ధికి పాటుపడ్డారన్నారు. చంద్రబాబు ప్రభుత్వంలో జన్మభూమి కమిటీల పేరుతో పెద్దఎత్తున అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని విమర్శించారు. కావు పారదర్శక పాలన అందాలంటే ప్రతి ఒక్కరూ ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను, హిందూపురం ఎంపిగా బోయ శాంతమ్మను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రచారంలో ఎంపిపి జగన్మోహన్, మండల కన్వీ నర్ జి.రవీంద్రరెడ్డి, పోరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచులు రవీందర్‌నాయక్, ఆంజనేయులు, శాంతమ్మ, నాగభూషణంరెడ్డి, జిల్లా కోఆప్షన్ సభ్యుడు ఎస్.ఫయాజ్ అలీ, గంగాధర్, సి.పురుషోత్తమరెడ్డి, మహమ్మద్ ఫరూక్, పామిడి మహమ్మద్ ఇక్బాల్, కార్యకర్తలు ఉన్నారు.

ప్రజలను ఓట్లు అభ్యర్థిస్తున్న కదిరి వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి బిఎస్.మక్బూల్